రథసారథి

దినపత్రిక

Right direction for the society

వెల:రూ.5/–

హైదరాబాద్ (తేదీ) 06-11-2026 (వారం) శుక్రవారం సంపుటి: 01|| సంచిక:159 || పేజీలు-8

RATHA SARATHI DINA PATRIKA



19 నుంచి
ఇందిరమ్మ జీవిత బీమా

- సిద్దిపేట నుంచి ప్రారంభం
- ఎస్సీ, ఎస్టీలకు విడివిడిగా కమిషన్లు
- కాళేశ్వరం బ్యారేజీల్లో ఫౌండేషన్ లోపం
- 1,199 కొత్త పోస్టుల మంజూరు
- మంత్రిమండలి భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

మిగతా 2లో

రథసారథి న్యూస్ హైదరాబాద్:

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఈ నెల 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సిద్దిపేటలో ప్రారంభించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలవుతుందని, అదే రోజున ఇందిరమ్మ చీరలు రెండో విడత పంపిణీని ప్రారంభిస్తామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు పూర్తిస్థాయి నివేదిక వచ్చిందని, దీనిపై సుదీర్ఘంగా చర్చించి పారదర్శకంగా మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని మంత్రిమండలి తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు.

మేడిగడ్డను పునరుద్ధరించకుండా
ఎత్తిపోయలేం

- నేరుగా పంపింగ్‌కు అవకాశముంటే ఇక బ్యారేజీలెందుకు?
- కన్నెపల్లి వద్ద ఎత్తిపోస్తే నీళ్లు మళ్లీ మేడిగడ్డకే వస్తాయి...
- ఇది తెలిసీ.. భారాస దుష్ప్రచారం
- మంత్రులు, పార్టీ యంత్రాంగం తిప్పికొట్టాలి
- నిపుణుల సూచనల మేరకే బ్యారేజీల పునరుద్ధరణ
- డిసెంబరులో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయండి
- మంత్రులతో సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రథసారథి న్యూస్ హైదరాబాద్:

పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, బ్యారేజీలు లేకుండానే పంపింగ్ చేసే అవకాశముంటే అసలు వాటిని నిర్మించడం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో భారాస చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రులకు సూచించారు. పరీక్షలన్నీ ముగిసి డిజైన్ల ఖరారు, అంచనాల తయారీ కొలిక్కి వచ్చినందున వీలైనంత త్వరగా బ్యారేజీ పునరుద్ధరణ పనులు ప్రారంభించి వచ్చే వానాకాలం సీజన్‌కు వినియోగంలోకి తేవడానికి గట్టి ప్రయత్నం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రికి, అధికారులకు సీఎం సూచించారు.

మిగతా 2లో



అరెస్ట్ పేరుతో
అక్రమ నిర్బంధంకుదరదు

- అక్రమ నిర్బంధం రాజ్యాంగ ఉల్లంఘనే..
- అలాంటి చర్యలతో వ్యక్తి ప్రాథమిక హక్కులకు విఘాతం
- పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ..| అరెస్ట్–నిర్బంధం వేర్వేరు కాదు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే 24 గంటల గడువు ప్రారంభం
- ఆ గడువులోపు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి
- లేదంటే తక్షణమే కస్టడీ నుంచి విడుదల చేయాలి

5

రథసారథి న్యూస్ న్యూఢిల్లీ:

రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు.. అర్ధరాత్రి అరెస్టులు.. రోజుల తరబడి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధాలు.. ఆ తర్వాత లాంఛనంగా అరెస్టు చూపించి కోర్టుల్లో హాజరుపరుస్తున్న పోలీసుల తీరుకు సుప్రీంకోర్టు చెక్‌పెట్టింది. అరెస్టు, నిర్బంధం వేర్వేరు కాదని, ఈ రెండింటి మధ్య కృత్రిమ వ్యత్యాసాన్ని చూపడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది.

మిగతా 2లో



'సీఐడీ' చేతికి సరికొత్త అస్త్రం

- అందుబాటులోకి అంబిస్ మొబైల్ ఫేస్ సెర్చ్ టూల్
- యాప్‌లో ఒక ఫొటో అప్‌లోడ్ చేస్తే 15 సెకన్లలో.. 9.8 లక్షల ముఖాల వడబోత

రథసారథి న్యూస్ హైదరాబాద్:

అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందుంటున్న రాష్ట్ర పోలీసుల చేతిలో మరో ఆధునిక నేరపరిశోధన అస్త్రం వచ్చి చేరింది. ముఖ గుర్తింపులో కీలకమైన 'అంబిస్ మొబైల్ ఫేస్ సెర్చ్ టూల్'ను తాజాగా సమకూర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే దర్యాప్తు అధికారులు ఈ టూల్‌ను వినియోగించే సదుపాయం గురువారం అందుబాటులోకి వచ్చింది. పాత నేరస్థుల, అనుమానితుల గుర్తింపులో ఈ టూల్ కీలకం కానుంది.

మిగతా 2లో

డిసెంబర్‌లో
స్వదేశానికి!

5

- బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా వెల్లడి
- ఎవరి సాయమూ కోరనని స్పష్టీకరణ

టార్గెట్ డొనాల్డ్ ట్రంప్!

- అధ్యక్షుని 'అవినీతి'పై విచారణ
- అస్త్రశస్త్రాలకు డెమొక్రాట్ల పదును
- 'మధ్యంతర'గెలుపుతో దూకుడు
- ఐదు అంశాలతో ఎజెండా సిద్ధం
- సమన్లతో పాటు 'అభిశంసన'!



2

రాహుల్.. విదేశాల్లో మీరేం చేస్తున్నారు

- అది తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది
- వివరాలు మీరే బయటపెట్టండి: అమిత్ షా

రథసారథి న్యూస్ కర్నాల్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి ఏం చేస్తున్నారో తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ వివరాలను రాహుల్ స్వయంగా బయటపెట్టాలని డిమాండు చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో భాజపా గురువారం నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి.. అరాచకత్వాన్ని నిర్మూలించండి' ర్యాలీలో షా పాల్గొని ప్రసంగించారు. ''రాహుల్.. మీరు తాజాగా వియత్నాం వెళ్లి వచ్చారు.

మిగతా 2లో



ఆరోపణలేనా..
రేవంత్‌పై చర్యల్లేవా?

- 'ఎక్స్'లో మోదీ, అమిత్‌షాలను ప్రశ్నించిన కేటీఆర్



5

నగరాల్లో రాంగ్‌రూట్..
జిల్లాల్లో మితిమీరిన వేగం




- వేగం తగ్గించరు.. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించరు..
- మూడు కమిషనరేట్లలోనే 37 లక్షల రాంగ్‌రూట్ కేసులు
- యాదాద్రి, కామారెడ్డి, నిజామాబాద్‌లలో అధిక ఉల్లంఘనలు

రథసారథి న్యూస్

ఇంటి నుంచి బయల్దేరిన వ్యక్తి తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకోవడం అగ్నిపరీక్షగా మారుతోంది. వాహనదారులు నగరాల్లో అత్యంత ప్రమాదకరంగా రాంగ్‌రూట్లలో దూసుకొస్తుంటే..జిల్లాల్లో వేగం హద్దులు దాటుతోంది. 2024, 2025, 2026 ఆగస్టు 15 వరకు నమోదైన ఈచలాన్ల గణాంకాలను రవాణాశాఖ తాజాగా అధ్యయనం చేసింది

మిగతా 5లో



ట్రూ అప్ షాక్ షురూ

- విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం
- 2022–23, 2023–24కు సంబంధించిన రూ. 7,635.22 కోట్లు వసూలు
- నవంబర్ బిల్లులోనే యూనిట్‌కు 30 పైసలు వసూలు
- వచ్చే నెల నుంచి యూనిట్‌కు 50 పైసలు
- 26 నుంచి 29 నెలల పాటు కొనసాగనున్న అదనపు బాదుడు

రథసారథి న్యూస్ హైదరాబాద్:

నవంబర్ కరెంట్ బిల్లు మధ్య తరగతి కుటుంబాలకు షాక్ ఇస్తోంది. ట్రూ అప్ భారం తడిసి మోపెడవుతోంది. ఎలాంటి సబ్సిడీ లేని కుటుంబాలకు నెలవారీ బిల్లులో వందల నుంచి వేల రూపాయల అదనపు భారం పడుతోంది. కరువుతో ఓ వైపు నిత్యావసరాలు అకాశాన్నంటుతున్నాయి. తాజాగా విద్యుత్ చార్జీల మోతతో సామాన్యుడు లబోదిబోమంటున్నాడు. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ట్రూ అప్ చార్జీలను విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో నవంబర్ బిల్లు నుంచి వీటిని అమలు చేస్తున్నారు.

మిగతా 5లో

19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా



రథసారథి న్యూస్ హైదరాబాద్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఈ నెల 19న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సిద్దిపేటలో ప్రారంభించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ రోజు నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలవుతుందని, అదే రోజున ఇందిరమ్మ చీరలు రెండో విడత పంపిణీని ప్రారంభిస్తామని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు పూర్తిస్థాయి నివేదిక వచ్చిందని, దీనిపై సుదీర్ఘంగా చర్చించి పారదర్శకంగా మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని మంత్రి మండలి తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల కోసం ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ భూముల బదిలీకి, అలాగే పలుపోస్టులకు ఆమోదం తెలిపిందన్నారు. గురువారమిక్కడ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 38వ మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పొంగులేటి విలేకరుల సమావేశంలో వివరించారు. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీలకు కలిపి ఒకటే కమిషన్ ఉందని, అందరి అభిప్రాయాల మేరకు రానున్నరోజుల్లో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు.

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

''ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ 2026 కార్యక్రమం నిర్వహించనున్నాం. దేశ విదేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన వందల మంది పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరవుతారు. ఈ ఏడాది ప్రపంచ దేశాల నుంచి భారీస్థాయిలో పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వానికి పూర్తి విశ్వాసముంది. రైజింగ్ తెలంగాణ పేరిట రాష్ట్రంలో మూడేళ్లుగా పలు కార్యక్రమాలు చేపట్టాం. పారిశ్రామిక, ఇతర సరళీకృత విధానాలను సమ్మిళితం చేసి ప్రపంచ దేశాలతో పోటీపడే రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం.

ఉపయోగంలోకి కాళేశ్వరం ప్రాజెక్టు...

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్డీఎస్ఏ అడిగిన అన్ని పరీక్షలు పూర్తిచేశాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఫౌండేషన్ లోపం ఉంది. కటాఫ్‌వాల్స్ సరిగా నిర్మించలేదు. స్పిల్‌వే వెడల్పు సరిగా లేదు. ఎగువ ప్రాంతంలో కాంక్రీటు డయాఫ్రమ్ వాల్ లేనందున బ్యారేజీల్లో నీళ్లు నిలపవద్దని గతంలో ఎన్డీఎస్ఏ ఆదేశాలు జారీచేసింది. ఆ ఆదేశాలు అమలు చేస్తూ ప్రభుత్వం అన్ని పరీక్షలు చేసింది. ఆ పరీక్షల వివరాలను ఎన్డీఎస్ఏకు ఇచ్చాం. ఆ సంస్థ సూచన మేరకు సీడబ్ల్యూసీకి అందించాం. ప్రాజెక్టులను ఎలా మరమ్మతు చేయాలి.. విధివిధానాలేమిటి... ఎలా ముందుకు వెళ్లాలన్న నివేదిక వచ్చింది. ఈ నివేదికపై సుదీర్ఘంగా చర్చించి... పారదర్శకంగా ప్రాజెక్టుల మరమ్మతులు చేయాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం...

దీపావళి రోజున రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమం నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈనెల 7, 8, 9 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పర్యటిస్తారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎక్స్‌పో ఉంటుంది. ఈనెల 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ ఉంటుంది. పండగరోజున సీఎం నుంచి సర్పంచ్ వరకు వారి పరిధిలో ఒక ఇందిరమ్మ ఇంట్లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో మంజూరైన వాటిల్లో ఇప్పటికే 2.25 లక్షల గృహాలు పూర్తయ్యాయి.

కొత్త పోస్టులకు ఆమోదం..

ప్రభుత్వంలో వివిధ శాఖల్లో కొత్తగా 1,199 పోస్టులను మంత్రిమండలి మంజూరు చేసింది. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో 886, ఫుడ్ సేఫ్టీలో 177, న్యాయ శాఖలో 136 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు మంత్రివర్గం ఆదేశాలిచ్చింది'' అని మంత్రి పొంగులేటి వివరించారు.

కరవుపై ప్రత్యేక అసెంబ్లీ

రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలో ప్రత్యేక శాసనసభా సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఎల్‌నినో నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన కరవు ప్రభావం.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు.. మున్ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. కేంద్ర సాయం.. తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. ఈ సమావేశాల్లోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా సుదీర్ఘంగా చర్చించాలని నిర్ణయించారు. కరవు పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదంగా ఆపాదిస్తూ.. భారాస చేస్తున్న ఆరోపణలను ఈ సమావేశాల్లో సమర్థంగా తిప్పిగొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలిసింది. త్వరలోనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సీఎం సూచించినట్లు తెలిసింది.

'సీఐడీ' చేతికి సరికొత్త అస్త్రం



రథసారథి న్యూస్ హైదరాబాద్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందుంటున్న రాష్ట్ర పోలీసుల చేతిలో మరో ఆధునిక నేరపరిశోధన అస్త్రం వచ్చి చేరింది. ముఖ గుర్తింపులో కీలకమైన 'అంబిస్ మొబైల్ ఫేస్ సెర్చ్ టూల్'ను తాజాగా సమకూర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే దర్యాప్తు అధికారులు ఈ టూల్‌ను వినియోగించే సదుపాయం గురువారం అందుబాటులోకి వచ్చింది. పాత నేరస్థుల, అనుమానితుల గుర్తింపులో ఈ టూల్ కీలకం కానుంది. ఉదాహరణకు జన సమ్మర్ద ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండటం అక్కడే ఉన్న ఓ పోలీస్ అధికారి కంటపడింది. కరడుగట్టిన పాత నేరస్థుడనే అనుమానంతో అతడి ఫొటో తీసి దాన్ని తన సెల్‌ఫోన్‌లో ఉన్న ఓ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. 15 సెకన్లలోనే అతడి నేర చరిత్ర సెల్‌ఫోన్ తెరపై ప్రత్యక్షమైంది. అంతర్రాష్ట్ర నేరస్థుడైన అతడిపై గతంలో పది కేసులతోపాటు నాన్‌బెయిలబుల్ వారంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడైంది. ఠాణాకు తీసుకెళ్లి విచారించడంతో భారీ చోరీకి పథకం రచించి హైదరాబాద్ వచ్చినట్లు తేలింది. ఈ నయా అస్త్రం ఇలాంటి నేరాల కట్టడికి పోలీసులకు ఎంతో ఉపకరిస్తుంది.

తెలంగాణ సీఐడీ డేటాబేస్‌లోని దాదాపు 9.8 లక్షల మంది పాతనేరస్థుల ముఖాలతోపాటు నేర రికార్డులను ఈ టూల్‌తో అనుసంధానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన పాత నేరస్థులతోపాటు ఇప్పటికే తెలంగాణ పోలీస్ రికార్డుల్లో ఉన్న కరడుగట్టిన అంతర్రాష్ట్ర నేరస్థుల ఫొటోలు, వివరాలు ఈ జాబితాలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఎవరైనా అనుమానితుడు పోలీసుల కంట పడితే అక్కడికక్కడే అతడిపై ఏమైనా నేరచరిత్ర ఉందా.. లేదా అని తెలుసుకోవడం సులభం. గతంలో అయితే అలాంటి అనుమానితుడిని ఫొటో తీసి సీఐడీ ప్రధాన కార్యాలయానికి పంపేవారు. అక్కడి సిబ్బంది తమ డేటాబేస్‌లోని ఫొటోలతో సరిపోల్చి చెప్పాల్సివచ్చేది.. కాలయాపన జరిగేది. తాజా టూల్‌తో ఈ సమస్య ఉండదు.

వీడియోలతోనూ శోధించవచ్చు

క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్), దర్పణ్ సహా నేర పరిశోధనకు అందుబాటులో ఉన్న వనరుల నుంచి సేకరించిన సుమారు 9.8 లక్షల ఫొటోలతో కూడిన డేటాబేస్‌ను ఈ టూల్ శోధిస్తుంది.

క్షేత్రస్థాయిలో ఉండే పోలీసులు.. ఫొటోలే కాకుండా వీడియో క్లిప్‌లను సైతం పంపించొచ్చు. వాటినీ యాప్ ఫేషియల్ డేటాబేస్‌లో శోధించగలుగుతుంది.

ఈ యాప్‌ను వినియోగించిన సమయం, తేదీ, భౌగోళిక స్థానంతోపాటు శోధన కార్యకలాపాల వివరాలు నిక్షిప్తమవుతాయి. టూల్ వినియోగంలో జవాబుదారీతనం కోసం జియోట్యాగ్డ్ ఆడిట్ ట్రయల్ నిర్వహించనున్నారు.

మేడిగడ్డను పునరుద్ధరించకుండా ఎత్తిపోయలేం



రథసారథి న్యూస్ హైదరాబాద్: పునరుద్ధరణ పనులు పూర్తికాకుండా మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని, బ్యారేజీలు లేకుండానే పంపింగ్ చేసే అవకాశముంటే అసలు వాటిని నిర్మించడం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో భారాస చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని రాష్ట్ర మంత్రులకు సూచించారు. పరీక్షలన్నీ ముగిసి డిజైన్ల ఖరారు, అంచనాల తయారీ కొలిక్కి వచ్చినందున వీలైనంత త్వరగా బ్యారేజీ పునరుద్ధరణ పనులు ప్రారంభించి వచ్చే వానాకాలం సీజన్‌కు వినియోగంలోకి తేవడానికి గట్టి ప్రయత్నం చేయాలని నీటిపారుదలశాఖ మంత్రికి, అధికారులకు సీఎం సూచించారు. కన్నెపల్లి వద్ద పంపింగ్ చేసి అన్నారానికి పంపినా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు బ్యారేజీ గేట్లు తెరిచే ఉంచాల్సి ఉందని, దీంతో ఎత్తిపోసిన నీళ్లు తిరిగి మేడిగడ్డకే వస్తాయని సీఎం తెలిపారు. ఈ విషయం తెలిసి కూడా భారాస నాయకులు పనిగట్టుకొని రోజూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, మంత్రులు, పార్టీ యంత్రాంగం దీన్ని తిప్పికొట్టాలని రేవంత్ పేర్కొన్నారు. గురువారం మంత్రివర్గ సమావేశానికి ముందు.. సచివాలయంలోనే మంత్రులందరితో సీఎం భేటీ అయ్యారు.

తొలుత గ్లోబల్ సమిట్ గురించి చర్చించిన తర్వాత కాళేశ్వరంపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌లు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీల దుస్థితిపై మంత్రులకు ఎలాంటి సమాచారం అవసరమైనా అధికారులు ఇస్తారని, అందరూ అవసరానికి తగ్గట్లుగా స్పందించాలని కోరారు. ఎన్‌డీఎస్ఏ, టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ (టీఓసీ) సిఫార్సుల మేరకే ముందుకు వెళ్లాలని, ఎక్కడా దారి తప్పవద్దని, పునరుద్ధరణ జరిగే సమయంలోనూ వారిని భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ఓ మంత్రి కోరారు. బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం లేకపోవడానికి కారణాలను విశ్లేషిస్తూ నీటిపారుదలశాఖ సంయుక్త కార్యదర్శి (టెక్నికల్) కె.శ్రీనివాస్, పునరుద్ధరణ పనులు, డిజైన్లు, అంచనా వ్యయం తదితరాలపై ప్రత్యేక కార్యదర్శి కర్నల్ పరీక్షిత్ మెహ్రాలు ప్రజంటేషన్ ఇచ్చారు. మేడిగడ్డ నుంచి ఎత్తిపోసిన నీటిని అన్నారంలో నిల్వచేసి సుందిళ్లకు ఎత్తిపోయాలంటే అన్నారం బ్యాక్‌వాటర్ 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంప్‌హౌస్ వరకు ఉండాలని, ఎన్‌డీఎస్ఏ సిఫార్సు మేరకు అన్నారం బ్యారేజీ గేట్లు తెరిచి ఉంచాల్సి ఉన్నందున.. ఎత్తిపోసిన నీళ్లు తిరిగి మేడిగడ్డకు చేరతాయని, అన్నారం నుంచి ఎత్తిపోయడం సాధ్యం కాదని వారు వివరించారు. పునరుద్ధరణకు సంబంధించిన పరీక్షలు, డిజైన్ల ఖరారు, అంచనాలు.. ఇలా అన్ని అంశాలను విశదీకరించారు. పునరుద్ధరణ పనులకు వచ్చే మంత్రివర్గ సమావేశంలో అంచనాలు పెట్టి ఆమోదింపచేసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశానికి సంబంధించి సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

డిసెంబరులోగా పనులు ప్రారంభించాలి

మేడిగడ్డ పునరుద్ధరణ పనులు డిసెంబరులోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. మేడిగడ్డ వద్ద కనిపించే నీటిని ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సీఎం మాట్లాడుతూ.. 'దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసి ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు.. తాగునీటిని అందించాం. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే.. గత మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేశాం. అక్టోబరు నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీలను సద్వినియోగం చేసుకున్నాం' అని వివరించారు.

వరి దిగుబడిలో రికార్డు

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని వివరించారు. 'తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మించి ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరవు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలి' అని సీఎం ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ... 'బ్యారేజీల సమగ్ర అధ్యయనం, పరిశోధనలు పూర్తయ్యాయి. పునరుద్ధరణ ప్రాథమిక ప్రణాళికలకు నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపింది' అని వివరించారు.

పునరుద్ధరణ అంచనా వ్యయం రూ.4,193 కోట్లు

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ వ్యయం పన్నులతో సహా రూ.4,193 కోట్లు అవుతుందని, పన్నులు లేకుండా రూ.3,200 కోట్లుగా ఉందని అధికారులు వివరించారు. సంబంధిత మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణసంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సీఎం స్పందిస్తూ.. పునరుద్ధరణ పనుల తుది అనుమతులను ఈ నెలాఖరులోగా పొందేందుకు ప్రయత్నించాలని ఆదేశించారు. బ్యారేజీల నీటి వినియోగ సామర్థ్యాన్ని పునరుద్ధరించే పనులతో పాటు రక్షణ పనులను రెండు దశలుగా విభజించుకోవాలని చెప్పారు. భద్రతాప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సీఎం స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్ పేరుతో అక్రమ నిర్బంధం కుదరదు



రథసారథి న్యూస్ న్యూఢిల్లీ: రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు.. అర్ధరాత్రి అరెస్టులు.. రోజుల తరబడి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధాలు.. ఆ తర్వాత లాంఛనంగా అరెస్టు చూపించి కోర్టుల్లో హాజరుపరుస్తున్న పోలీసుల తీరుకు సుప్రీంకోర్టు చెక్‌పెట్టింది. అరెస్టు, నిర్బంధం వేర్వేరు కాదని, ఈ రెండింటి మధ్య కృత్రిమ వ్యత్యాసాన్ని చూపడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. ఒక వ్యక్తిని పోలీసులు తమ అదుపులోకి తీసుకున్న క్షణమే అరెస్టుగా పరిగణించాలని, అప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

నిందితుడు స్వేచ్ఛను కోల్పోయి, వాస్తవంగా పోలీసుల అదుపులోకి వెళ్లిన (నిర్బంధించిన) క్షణం నుంచే ఈ సమయాన్ని లెక్కించాలని ఆదేశించింది. రికార్డుల్లో అరెస్టు సమయాన్ని ఆలస్యంగా నమోదు చేసి వ్యక్తి ప్రాథమిక హక్కులకు సంబంధించి రాజ్యాంగ నిబంధనల నుంచి తప్పించుకోలేరని తేల్చిచెప్పింది. 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోతే తక్షణమే విడుదల చేయాల్సిందేనని స్పష్టం చేసింది. 'సుజిత్ దాస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం, ఈ వ్యాజ్యానికి సంబంధించి త్రిపుర హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ సంచలన తీర్పును వెలువరించింది.

తాజా తీర్పుతో పోలీసుల నిర్బంధ ప్రక్రియ, నిందితుల ప్రాథమిక హక్కుల పరిరక్షణపై అత్యున్నత న్యాయస్థానం దేశవ్యాప్తంగా స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించినట్లయింది. దేశవ్యాప్తంగా పోలీసుల నిర్బంధ అధికారాలకు కళ్లెం వేయడంతోపాటు, ముఖ్యంగా రెడ్‌బుక్ రాజ్యాంగానికి బానిసలుగా మారి రాజకీయ ప్రత్యర్థుల అక్రమ అరెస్టుల విషయంలో దేశంలోనే ముందున్న ఏపీ పోలీసులకు సైతం ఈ తీర్పు గట్టి హెచ్చరికగా మారింది.


ప్రాథమిక హక్కులకు లోబడే కఠినమైన బెయిల్ నిబంధనలు

ఈ కేసులో నిందితులను పోలీసులు దాదాపు 18 గంటల పాటు ఎలాంటి న్యాయపరమైన పర్యవేక్షణ లేకుండా నిర్బంధంలో ఉంచడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇది ఆర్టికల్ 22(2)తో పాటు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 58 ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టంలోని సెక్షన్ 37 కింద ఉండే కఠినమైన బెయిల్ నిబంధనలు సైతం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అధిగమించలేవని స్పష్టంచేసింది. కస్టోడియల్ హింస నివారణకు గాను సరైన న్యాయపరమైన పర్యవేక్షణ ఉండటం అత్యంత అవసరమని స్పష్టంచేసింది ఈ తీర్పును దేశవ్యాప్తంగా అనుసరించాల్సిన రిపోర్టబుల్ తీర్పుగా ప్రకటించింది. ఈ కేసులో నలుగురు నిందితులను తక్షణం విడుదల చేయాలని ఆదేశించింది.

ఆ హైకోర్టుల తీర్పులు చెల్లవు

ఈ అంశంపై తాజాగా త్రిపుర హైకోర్టుతోపాటు గతంలో వివిధ రాష్ట్రాల న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను సైతం సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా కొట్టివేసింది. ముఖ్యంగా ఒడిశా హైకోర్టు (అర్యమ పట్నాయక్ కేసు), మద్రాస్ హైకోర్టు (కణ్ణన్ కేసు), కేరళ హైకోర్టు (అరుణ్ కే థామస్ కేసు) ఇచ్చిన తీర్పులు ఆర్టికల్ 22(2)కి సరైన భాష్యం చెప్పలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆయా హైకోర్టుల చట్టపరమైన వివరణలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 'ఆర్టికల్ 22(2) ప్రకారం 24 గంటల గడువు.. సోదాలు, స్వాధీన ప్రక్రియ పూర్తయిన తర్వాతే ప్రారంభమవుతుందని, అరెస్టు చేసిన అధికార యంత్రాంగం రికార్డుల్లో అరెస్టు సమయంగా పేర్కొన్నప్పటి నుంచే ఈ గడువు లెక్కించాలని చెప్పడం చట్టపరంగా ఎంతమాత్రం సమర్థనీయం కాదు. అంతేకాకుండా, అది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

టార్గెట్ డొనాల్డ్ ట్రంప్!



రథసారథి న్యూస్ న్యూఢిల్లీ: వాషింగ్టన్: అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికల్లో నెగ్గి దూకుడు మీదున్న డెమొక్రాట్లు జోరు మరింత పెంచనున్నారు. ఎన్నికల్లో కీలకాంశంగా నిలిచిన అవినీతినే అధికార రిపబ్లికన్ పార్టీపై తిరుగులేని అస్త్రంగా ప్రయోగించాలని నిర్ణయించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలను లక్ష్యం చేసుకోనున్నారు.

కాంగ్రెస్ (దేశ పార్లమెంటు)లోని ఉభయ సభల్లోనూ కొత్తగా అందివచ్చిన అధికారాన్ని ఇందుకోసం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డెమొక్రటిక్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఐదంశాలతో ఏకంగా భారీ ఎజెండానే సిద్ధం చేసుకుంటోంది! అవసరమైతే ట్రంప్ అభిశంసనకు కూడా వెనకాడబోమని ప్రతినిధుల సభ స్పీకర్ అవుతారని భావిస్తున్న హకీం జెఫ్రీస్ ఇప్పటికే సంకేతాలిచ్చారు కూడా!!

రెండోసారి అధికారాన్ని చేపట్టిన నాటినుంచీ ట్రంప్, ఆయన కుటుంబ ఆస్తులు అపారంగా పెరిగాయన్నది డెమొక్రాట్ల ప్రధాన ఆరోపణ. అవినీతిని పూర్తిగా కడిగిపారేయాలన్నదే మధ్యంతర ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు తాలూకు సారాంశమని డెమొక్రాట్ నేత చుక్ షెమర్ అభిప్రాయపడ్డారు.

ట్రంప్ కుటుంబ వ్యాపార వ్యవహారాలు, వైట్‌హౌస్ బాల్ రూమ్‌తో పాటు వాషింగ్టన్ నలుమూలలా చేపట్టిన నిర్మాణ, రియల్టీ ప్రాజెక్టులలు, ఎప్‌స్టీన్ ఫైళ్లు, వలసదారులపై ఇమిగ్రేషన్-కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) దాడులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) పనితీరు తదితరాలన్నీ విచారణ పరిధిలోకి రానున్నట్టు పార్టీ నేతలు గార్షియా, జరేడ్ హాఫ్‌మన్ తదితరులు వెల్లడించారు. ఇందుకోసం అవసరమైతే 'సమన్ల జారీ'అధికారాన్ని కూడా వాడుకునేలా డెమొక్రాట్లు పథక రచన చేస్తున్నారు.

చట్టసభలను ట్రంప్ యంత్రాంగం తమ సొంత సంస్థల్లా వాడుకున్న రోజులకు కాలం చెల్లిందని జెఫ్రీస్ అన్నారు. మంగళవారం జరిగిన మధ్యంతర ఎన్నికల్లో అమెరికా ఓటర్లు ట్రంప్‌కు కర్రుగాల్చి వాత పెట్టడం తెలిసిందే. అవినీతి పెద్ద సమస్యగా మారినట్టు సగానికి సగం మంది ఓటర్లు పేర్కొన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి బాలేదని ప్రతి 10 మంది ఓటర్లలోనూ నలుగురికి పైగా, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ముగ్గురు కుండబద్దలు కొట్టారు. వారిలో అత్యధికులు డెమొక్రటిక్ పార్టీకే ఓటేయడంతో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాభవం మూటగట్టుకోవాల్సి వచ్చింది.

రాహుల్.. విదేశాల్లో మీరేం చేస్తున్నారు



కర్నాల్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి ఏం చేస్తున్నారో తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ వివరాలను రాహుల్ స్వయంగా బయటపెట్టాలని డిమాండు చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో భాజపా గురువారం నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి.. అరాచకత్వాన్ని నిర్మూలించండి' ర్యాలీలో షా పాల్గొని ప్రసంగించారు. ''రాహుల్.. మీరు తాజాగా వియత్నాం వెళ్లి వచ్చారు. కానీ దాని గురించి మాట్లాడటం లేదు. మీ విదేశీ పర్యటనల వివరాలు బయటపెట్టండి. వియత్నాం ఎందుకు వెళ్లారు? అక్కడ ఎన్నాళ్లు ఉన్నారు? ఎవరెవరితో సమావేశమయ్యారు? మీరు లోక్‌సభ విపక్ష నేత. అది రాజ్యాంగబద్ధ హోదా. కాబట్టి మీ విదేశీ పర్యటన గురించి తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది'' అని షా పేర్కొన్నారు. ఈవీఎంలు లోపభూయిష్టమైనవని రాహుల్ భావిస్తే.. కేరళ, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ అధికారం ఎందుకు చేపట్టిందని షా ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్ర నేతకు అర్థవంతమైన చర్చలు కావాలంటే.. పార్లమెంటుకు రావాలని సూచించారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చలకు రాహుల్ సవాలు చేస్తుండటాన్ని ఆయన ఎద్దేవా చేశారు. ''మోదీ దాకా వద్దు. హరియాణాలో మా యువ మోర్చా అధ్యక్షుడు మీతో చర్చకు వస్తారు'' అని పేర్కొన్నారు. మోదీతో చర్చ కావాలంటే ఆయనకు అధికారికంగా లేఖ రాయాలని షా సూచించారు. 1న దిల్లీలో విపక్ష ఇండియా కూటమి చేపట్టిన నిరసనను 'చొరబాటుదారుల రక్షణ ర్యాలీ'గా షా అభివర్ణించారు.

మళ్లీ భాజపా అధ్యక్షుడవండి.. అమిత్ షాకు కాంగ్రెస్ చురక

దిల్లీ: దేశ రాజధానిలో ఈ నెల 1న విపక్ష ఇండియా కూటమి చేపట్టిన నిరసనను 'చొరబాటుదారుల రక్షణ ర్యాలీ'గా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించడంపై కాంగ్రెస్ మండిపడింది. ఆయన హోం శాఖను సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని.. దాన్ని వదిలేసి, తిరిగి భాజపా అధ్యక్షుడిగా మారాలని చురకలంటించింది. షా హోం మంత్రిగా ఉండగా దేశంలోకి చొరబాట్లు పెరిగాయని.. పుల్వామా, పహల్గాంలలో ఉగ్రదాడులు జరిగాయని.. ఎర్రకోట సమీపంలో పేలుడు చోటుచేసుకుందని.. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం చీఫ్ పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు.


బాలల హక్కుల పరిరక్షణకు
ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

-బాలలను నేరస్థులుగా కాకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆదరించాలి
-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య



సంగారెడ్డి ప్రతినిధి, నవంబరు 5 (రథసారథి న్యూస్): ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తెలిపారు. నవంబరు 9న నిర్వహించనున్న జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని బాల న్యాయ మండలి కార్యాలయంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం న్యాయ సేవాధికార సంస్థల ప్రధాన లక్ష్యమని వివరించారు. బాలల హక్కులు, సంరక్షణ, రక్షణకు సంబంధించిన చట్టాలతోపాటు బాలల న్యాయ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2015లోని ముఖ్య నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి బాలబాలికకు విద్య, వైద్యం, భద్రత, సంరక్షణ, గౌరవప్రదమైన జీవితం పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. బాలలపై హింస, వేధింపులు, వివక్ష, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, ఇతర దోపిడీ చర్యలు జరగకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చట్టంతో సంఘర్షణకు గురైన బాలలను నేరస్థులుగా చూడకుండా వారి వయస్సు, పరిస్థితులు, భవిష్యత్తును పరిగణనలోకి తీసుకొని కౌన్సెలింగ్, పునరావాసం, విద్య, సమాజంలో తిరిగి కలిసిపోయేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బాలలపై నేరాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. బాల న్యాయ మండలిలో కేసుల విచారణ సందర్భంగా బాలల గోప్యతను కాపాడటంతోపాటు వారి ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వివరించారు. అర్హులైన బాలలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయవాదుల సేవలు, అవసరమైన మార్గదర్శకత్వం అందుబాటులో ఉన్నాయని, న్యాయ సహాయం పొందేందుకు ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె. ధనలక్ష్మి, బాల న్యాయ మండలి సభ్యుడు వాసుదేవ్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది, మండలి న్యాయవాది నిజాముద్దీన్, న్యాయ సహాయ కేంద్రం న్యాయవాది జె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి





-బోనస్ బకాయిలను వెంటనే చెల్లించాలి..
-కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
-అధికారులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచన

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్): రైతులు ఎంతో కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి మండలంలోని కులాబ్‌గుర్, కొత్తాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు పంటల కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులందరికీ సమాన ప్రాధాన్యం కల్పించాలని, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచే ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. సన్నధాన్యం పండించిన అర్హులైన రైతులకు ప్రతి క్వింటాకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 ప్రోత్సాహకాన్ని అందించడంతోపాటు గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు, పంట రుణాల సమస్యలు, ఎరువుల కొరతను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని కోరినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు, బరకాలు, తాగునీరు, నీడ వంటి సదుపాయాలు కల్పించాలని, ధాన్యం తేమశాతం పరీక్షలు, తూకంలో పారదర్శకత పాటించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేందుకు రవాణా ఏర్పాట్లు చేయడంతోపాటు రైతులకు చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటాయని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలు సకాలంలో అందినప్పుడే వ్యవసాయ రంగం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, ఆయా గ్రామాల సర్పంచులు, డీసీఎంఎస్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు
అవగాహన కల్పించాలి

-ఎన్నికల అక్షరాస్యత సంఘాల ఆధ్వర్యంలో వ్యాసరచన, ప్రశ్నావళి పోటీలు
-నవంబరు 20లోగా మూడు దశల్లో పోటీలు పూర్తి చేయాలి
-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్



సంగారెడ్డి ప్రతినిధి, నవంబరు 5(రథసారథి న్యూస్): భావి ఓటర్లలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్య స్ఫూర్తిని కలిగించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ఎన్నికల అక్షరాస్యత సంఘాల ఆధ్వర్యంలో వ్యాసరచన, ప్రశ్నావళి పోటీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ ఆదేశించారు. నవంబరు 20లోగా మూడు దశల్లో పోటీలను పూర్తి చేయాలని సూచించారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో ఆయన పోటీల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి జిల్లా నుంచి అదనపు కలెక్టర్ సంగీతతో పాటు కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నవంబరు 2 నుంచి 20 వరకు పాఠశాలలు, కళాశాలలు, శాసనసభ నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో మూడు దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. తొలుత విద్యాసంస్థల స్థాయిలో పోటీలు నిర్వహించి, ప్రతి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను శాసనసభ నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చాటిన పది మంది విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తారు. పాఠశాలలు, కళాశాలల స్థాయిలో నవంబరు 2 నుంచి 7 వరకు, శాసనసభ నియోజకవర్గ స్థాయిలో నవంబరు 10 నుంచి 13 వరకు, జిల్లా స్థాయిలో నవంబరు 16 నుంచి 18 వరకు పోటీలు నిర్వహించనున్నారు. వ్యాసరచన పోటీలకు ఓటు హక్కు ప్రాధాన్యం, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ఆవశ్యకత అనే అంశాలను కేటాయించారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో వ్యాసాలు రాయవచ్చు. ప్రతి స్థాయిలో పోటీలను మూల్యాంకనం చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి విజేతలను ఎంపిక చేయనున్నారు. జిల్లా స్థాయి విజేతల వివరాలు, పోటీల నిర్వహణ, ప్రచార కార్యక్రమాల సమాచారంతో కూడిన సమగ్ర నివేదికను నవంబరు 25లోగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. జిల్లాలో పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఓటరు అవగాహన కార్యక్రమాల సమన్వయ అధికారి పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

బొడ్రాయిని తిరిగి పైకి లేపేందుకు గ్రామస్తులంతా ఏకతాటిపైకి రావాలి





-రాజకీయాలకు అతీతంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమావేశమై నిర్ణయం తీసుకోవాలి

బొబ్బిలి సుధాకర్

టేక్మాల్, నవంబర్ 5 (రథసారథి న్యూస్): గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయి ప్రస్తుతం భూమిలోకి కుంగిపోవడంతో దానిని తిరిగి పైకి లేపేందుకు గ్రామస్తులందరూ ఐక్యంగా ముందుకు రావాలని బొబ్బిలి సుధాకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌తోపాటు ప్రజాప్రతినిధులందరూ కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామ ప్రజల సమక్షంలో బొడ్రాయి అంశంపై చర్చించి, పెద్దల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తిరిగి పైకి లేపేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బొడ్రాయిని పునఃప్రతిష్ఠించడం వల్ల గ్రామానికి శుభం కలుగుతుందని పెద్దలు విశ్వసిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో పరిశీలించాలని అన్నారు. ఇది గ్రామ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, శ్రేయస్సుతో ముడిపడిన అంశమని, ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా గ్రామస్తులంతా ఒకే తాటిపైకి వచ్చి సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టేక్మాల్ గ్రామ అభివృద్ధి, సంప్రదాయాల పరిరక్షణ, గ్రామ ప్రజల ఐక్యతను దృష్టిలో ఉంచుకొని పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని బొబ్బిలి సుధాకర్ కోరారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



-పొదుపు సంఘాలు వ్యాపార కేంద్రాలుగా మారాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమాహారతి

సంగారెడ్డి ప్రతినిధి, నవంబరు 5 (రథసారథి న్యూస్): సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య 110వ సమావేశం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు యోగేశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉమాహారతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు కేవలం పొదుపు సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా, విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా పొదుపు సంఘాలు వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని, జిల్లా, మండల సమాఖ్యలు కేవలం రుణాల పంపిణీకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించాలని సూచించారు. ప్రతి మండల సమాఖ్య ఆదాయం సమకూర్చే కార్యక్రమాలను చేపట్టాలని, ఇందుకు అవసరమైన శిక్షణతోపాటు పెట్టుబడి సహకారం కూడా అందిస్తామని తెలిపారు. వచ్చే నెల జరిగే సమావేశానికి వ్యాపారాభివృద్ధికి సంబంధించిన కార్యాచరణ ప్రతిపాదనలతో రావాలని, ఈ బాధ్యతను డీపీఎంలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని మండల సమాఖ్యలకు మంజూరైన భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత మండల రెవెన్యూ, అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంతోపాటు అవకాశం ఉన్న ప్రాంతాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీపీఎంలు సెర్ప్ కార్యక్రమాల అమలు, వాటి ప్రాధాన్యంపై సమాఖ్య ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లాలోని 23 మండలాల మహిళా సమాఖ్యల అధ్యక్షులు, డీపీఎంలు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



-13వ వార్డులో రూ.10 లక్షలతో భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణం..
1-34వ వార్డులో సీసీ కాలువ పనులు ప్రారంభం

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్): పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న పనుల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని 13, 34వ వార్డుల్లో మురుగునీటి కాలువల నిర్మాణ పనులను టీజీఐఐసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 34వ వార్డులో పురపాలక సంఘ సాధారణ నిధులతో నిర్మించనున్న సిమెంటు కాంక్రీటు మురుగునీటి కాలువ పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే ఆయా వార్డుల్లో మురుగునీటి సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమాల్లో పురపాలక సంఘ అధ్యక్షురాలు కూన వనిత సంతోష్, ఉపాధ్యక్షుడు షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు తదితరులు పాల్గొన్నారు.

హరిజనవాడ పాఠశాలలో
తల్లిదండ్రుల సమావేశం



-విద్యార్థుల విద్యా ప్రగతిని వివరించిన ఉపాధ్యాయులు

టేక్మాల్, నవంబర్ 5 (రథసారథి న్యూస్): మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హరిజనవాడలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువులో సాధించిన ప్రగతి, అభ్యసన సామర్థ్యాలు, విద్యా నైపుణ్యాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని తెలియజేస్తూ వారి ప్రతిభ, పురోగతిని తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ఇంటి వద్ద కూడా పునశ్చరణ చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు నాగరాణి సమక్షంలో ఈ సమావేశం నిర్వహించారు.

మల్లి దొంగతనం కేసును ఛేదించిన

హద్నూర్ పోలీసులు
-ముగ్గురు నిందితుల అరెస్టు..
-బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు స్వాధీనం
-పోలీసుల పనితీరును అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్):

హద్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లి గ్రామంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. మల్లి గ్రామానికి చెందిన అవుటి బసప్ప ఇంట్లో సెప్టెంబరు 20న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఒక జత బంగారు కమ్మలు, మూడు చేతి ఉంగరాలు, రెండు జతల వెండి పట్టగొలుసులు, రెండు కడియాలు, రూ.60 వేల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హద్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబరు 4న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన ముగ్గురిని వెంబడించి పట్టుకున్నారు. విచారణలో మల్లి గ్రామంలో ఇంటి దొంగతనానికి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను బీదర్‌లో విక్రయించేందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు.

నిందితులుగా యాకత్పూర్‌కు చెందిన పవన్, మొల్లవాలెకు చెందిన ఎం.డి. హుస్సేన్, హమారాబాద్‌కు చెందిన గుండప్ప లను గుర్తించారు. వారి నుంచి 7.8 గ్రాముల బంగారు ఆభరణాలు, 13.1 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదుతోపాటు చోరీ సొత్తు తరలించేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు హద్నూర్ ఎస్సై దోమ సుజిత్ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్సై సుజిత్‌తోపాటు పోలీసు సిబ్బంది మహేష్, శ్రీకాంత్, రాజశేఖర్, సాయికిరణ్, అశోక్‌లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేకంగా అభినందించారు.

పత్తి క్వింటాకు రూ.9,500 మద్దతు ధర కల్పించాలి



-కౌలు రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలి..
-కరువు నిధులు వెంటనే విడుదల చేయాలి
-రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు డిమాండ్

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టాల పాలవుతున్నారని, పత్తి క్వింటాకు రూ.9,500 మద్దతు ధర కల్పించడంతోపాటు కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో రైతులతో కలిసి పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల పత్తి కూడా సరిగా దిగుబడి రావడం లేదని, రైతులు పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పత్తి క్వింటాకు రూ.9,500 ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. పంటలు పండక కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, వారికి ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు తక్షణమే కరువు నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండలో నిర్వహించనున్న రైతు సంఘం అఖిల భారత 36వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూషణం, ఏఘాబు, బుచ్చయ్య, శివయ్యతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభలు



-డిసెంబరు 12, 13 తేదీల్లో నాలుగో రాష్ట్ర విద్యా మహాసభలు
విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాలుగో రాష్ట్ర విద్యా మహాసభలను సంగారెడ్డిలో నిర్వహించేందుకు సన్నాహక సమావేశం గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ మహాసభల నిర్వహణ, విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయి సంఘాల నిర్మాణంతోపాటు జిల్లా కమిటీ పునర్నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్ర మహాసభలకు సిద్ధం కావాలని సూచించారు. డిసెంబరు 12, 13 తేదీల్లో నిర్వహించనున్న మహాసభలకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం దుర్గయ్య మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల నిర్వహణకు సంగారెడ్డికి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ శుభాస్ సింగ్, రాష్ట్ర అనుబంధ అధ్యక్షుడు కుర్రి చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడిత్య లక్ష్మణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బిట్టు వసంత్ కుమార్, జిల్లా కోశాధికారి ధర్మ, మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి చిత్తారి దుర్గయ్య, మండల కార్యదర్శి రవీందర్‌తోపాటు శ్రీనివాస్, నరేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగర్‌లో గృహప్రవేశ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



-నూతన గృహ యజమాని కుమార్ కుటుంబానికి శుభాకాంక్షలు

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5 (రథసారథి న్యూస్): సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామానికి చెందిన కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ వేడుకకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై నాయకులతో చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం

రైతులకు అండగా నిలవాలి.. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు
మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచన
లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ.. పలు అభివృద్ధి పనుల ప్రారంభం

కొనరావుపేట,నవంబర్ 5 (రథసారథి న్యూస్):

రైతుల సంక్షేమం,ప్రజా సమస్యల పరిష్కారం,అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు.గురువారం ఆయన కొనరావుపేట మండలంలో పర్యటించి కొలనూరు గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి,రూ.10 లక్షలతో నిర్మాణం పూర్తిచేసుకున్న మహిళా సమాఖ్య సంఘం భవనానికి ప్రారంభోత్సవం చేశారు.అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 25 మంది అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసి,కొనరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్ష,కార్యవర్గ సభ్యుల అభినందన సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజల మధ్య ఉంటూ సేవ చేసేవారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని,పదవులు ప్రజలకు సేవ చేసే అవకాశాలని అన్నారు.ఒక పదవికి పలువురు సమర్థులు పోటీపడినప్పటికీ పరిపాలనా సౌలభ్యం కోసం ఒకరికే అవకాశం కల్పించాల్సి ఉంటుందని,బాధ్యతలు పొందినవారే గొప్పవారు,పొందనివారు తక్కువ అనే భావన ఎవరికీ ఉండకూడదని స్పష్టం చేశారు.రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందేలా చూడాలని,పంట చేతికి వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు,పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ,గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉచిత విద్యుత్,ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి నిర్ణయాలు రైతులకు మేలు చేశాయని గుర్తుచేశారు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ హామీని అమలు చేసిందని,రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,650 కోట్ల మేర ఏకకాలంలో రుణమాఫీ చేసి ఆర్థిక వెసులుబాటు కల్పించిందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులు,వడ్డీ భారాలు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని,అభివృద్ధి,సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.రైతులు సాగుకు అనుకూలమైన సన్నరకాలను ఎంచుకోవాలని,మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని సూచించారు.సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్‌తో పాటు సాధారణ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు,నీటి లభ్యతలో మార్పులు వచ్చే అవకాశాలున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టుల్లో 400 టీఎంసీలకు పైగా నీరు ఉండగా,ప్రస్తుతం సుమారు 200 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని,ఈ పరిస్థితుల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు.నీటి వనరుల పరిరక్షణ,భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని,ప్రతి గ్రామంలో ఒక ఊరకుంట,ప్రతి పొలం వద్ద ఒక నీటి గుంట,ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.చెరువులు,కాలువల మరమ్మతులు,నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రతిపాదనలు అందిస్తే నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.అవసరమైన సందర్భాల్లో తక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ.కోటి చొప్పున నిధులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.వచ్చే జనవరి నుంచి ఏప్రిల్,మే నెలల వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని,దీంతో గ్రామీణ ప్రజలకు ఉపాధితో పాటు నీటి వనరుల అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని,కోడూరుపేట ప్రాంతంలో 1,500 మంది విద్యార్థులు చదువుకునేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చర్యలు చేపట్టామని,టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని వెల్లడించారు.ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమన్నారు.విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం,దేవస్థానం అభివృద్ధి,సాగునీటి ప్రాజెక్టులు,రహదారులు,పంతెనల నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని,గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఐదు గ్యారంటీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రైతు రుణమాఫీ,ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని,మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశామని,మరో 2,000 ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు నూతన పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని,రైతులకు అండగా నిలుస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.




సీఎంఆర్ బకాయిదారుల ఆస్తులు జప్తు చేయాలి!

కరీంనగర్,నవంబర్ 5 (రథసారథి న్యూస్):

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వానికి బకాయిపడిన రైస్ మిల్లర్లపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,రెవెన్యూ రికవరీ చట్టం కింద వారి ఆస్తులతో పాటు షూరిటీలుగా ఉన్నవారి ఆస్తులను కూడా జప్తు చేయాలని సీపీఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.జిల్లాలో రైస్ మిల్లుల రిజిస్ట్రేషన్‌కు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరి అని,ఈ విషయంపై గత మూడేళ్లలో పలుమార్లు జిల్లా రిజిస్ట్రార్‌కు అడిషనల్ కలెక్టర్ లేఖలు రాసినట్లు తెలిపారు. అయినప్పటికీ డిఫాల్టర్లగా ఉన్న ఇద్దరు మిల్లర్లు తమ మిల్లులను ఇతరులకు విక్రయించారని ఆరోపించారు.చొప్పదండిలోని శ్రీ శ్వేత రైస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి సుమారు రూ.5 కోట్లు బకాయిపడినప్పటికీ,నిరభ్యంతర పత్రం లేకుండానే రెండేళ్ల క్రితం మరో వ్యక్తికి మిల్లును రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు.అలాగే కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్,ఆదిత్య ఇండస్ట్రీస్‌కు చెందిన యజమాని 202223 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వానికి రూ.6.19 కోట్లు బకాయిపడినప్పటికీ,నిరభ్యంతర పత్రం లేకుండానే మిల్లును మరొకరికి విక్రయించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన సబ్‌రిజిస్ట్రార్,సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజాధనాన్ని బకాయిపడిన మిల్లర్లు హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందుతూ అరెస్టుల నుంచి తప్పించుకుని స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శించారు.

ట్రూ అప్ షాక్ షురూ



రథసారథి న్యూస్ హైదరాబాద్: నవంబర్ కరెంట్ బిల్లు మధ్య తరగతి కుటుంబాలకు షాక్ ఇస్తోంది. ట్రూ అప్ భారం తడిసి మోపెడవుతోంది. ఎలాంటి సబ్సిడీ లేని కుటుంబాలకు నెలవారీ బిల్లులో వందల నుంచి వేల రూపాయల అదనపు భారం పడుతోంది. కరువుతో ఓ వైపు నిత్యావసరాలు అకాశాన్నంటుతున్నాయి. తాజాగా విద్యుత్ చార్జీల మోతతో సామాన్యులబోదిబోమంటున్నాడు. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ట్రూ అప్ చార్జీలను విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతో నవంబర్ బిల్లు నుంచి వీటిని అమలు చేస్తున్నారు.

2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ కొనుగోళ్లు, ఆదాయం మధ్య గ్యాప్‌ను డిస్కమ్‌లు రూ.7,635.22కోట్లుగా పేర్కొన్నాయి. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన ధర కన్నా మార్కెట్లో ఎక్కువ ధరకు..22-23 సంవత్సరానికి రూ.5,186 కోట్లకు పైగా, 23-24 సంవత్సరానికి రూ.2,448 కోట్లకు పైగా విద్యుత్ కొనుగోలు చేశారు. ప్రతిపాదించిన దానికన్నా ఎక్కువగా ఉన్నదాన్ని ట్రూ అప్ అంటారు. ఈ అంతరాన్ని పూడ్చుకునేందుకు విద్యుత్ సంస్థలు ట్రూ అప్ చార్జీల పేరిట వినియోగదారుల నుంచి వసూలు చేస్తాయి. అయితే ఇన్నాళ్లూ పెండింగ్‌లో ఉన్న ఈ భారాన్ని డిస్కమ్‌లు ఇప్పుడు బయటకు తీశాయి.

ఇది ఆరంభమే..

మొదటి నెల కాబట్టి యూనిట్‌కు 30 పైసలు వసూలు చేస్తున్నట్లు డిస్కమ్‌లు తెలిపాయి. వచ్చే నెల నుంచి 50 పైసలు వసూలు చేయనున్నాయి. ఈ వసూళ్ల కార్యక్రమం అదనపు వ్యయం రాబట్టుకునే వరకు దాదాపు 26 నుంచి 29 నెలల పాటు కొనసాగుతుంది. స్మార్ట్ మీటర్లు కావడం వల్ల సెల్‌ఫోన్ చార్జర్‌కు వాడే విద్యుత్‌ను కూడా మీటర్ లెక్కిస్తుంది. ఈ లెక్కన నెలకు సగటున 600 నుంచి 2,000 యూనిట్ల విద్యుత్‌ను వినియోగదారులు వాడతారు. ఎల్‌నినో ఎఫెక్ట్ కారణంగా కొన్నాళ్లుగా ప్రతీ ఇంట్లో ఏసీల వాడకం పెరిగింది. దీంతో ప్రతి కుటుంబానికి అసలు బిల్లు కాకుండా అదనంగా రూ.300 నుంచి రూ.1,000 వరకూ అదనంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి.

అప్పటి వ్యయం ఇప్పుడు వసూలు

వాస్తవానికి 2022-23, 2023-24లో ఏ కుటుంబంలోనూ ఇంత విద్యుత్ వాడకం లేదు. ఇప్పటిలాగా వర్షాకాలం, చలికాలంలోనూ ఏసీలు, ఇతర విద్యుత్ ఉపకరణాలు వాడాల్సిన పని పడలేదు. వేసవిలో మాత్రమే చాలామంది ఏసీలు, ఎక్కువ మంది ఫ్యాన్లు వాడారు. కాబట్టి వేసవి మూడు నెలలు మినహా మిగతా రోజుల్లో కరెంట్ వాడకం తక్కువ. కానీ ఇప్పుడు ఎల్ నినో పరిస్థితుల్లో ఫ్యాన్లు, ఏసీల వాడకం పెరుగుతోంది. అక్టోబర్ నెలలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు వెళ్ళినట్టు విద్యుత్ శాఖ తెలిపింది. కాగా అప్పుడు కరెంటు తక్కువ వినియోగమే అయ్యిందని, అయితే అప్పట్లో విద్యుత్ కొనుగోలుకు ఎక్కువ వ్యయం అయ్యిందని ఇప్పుడు ట్రూ అప్ చార్జీలు విధించడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

ఎవరో వాడితే మేం కట్టాలా?

కొత్తగా అద్దె ఇళ్ళల్లో దిగినవారు ఈ ట్రూ అప్ భారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ళ క్రితం ఆ ఇంట్లో ఉన్నవాళ్లు ఎవరో ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే ఇప్పుడు మేం పొదుపుగా వాడినా పాతవాళ్ళు వాడిన విద్యుత్ భారం మోయాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్లలో హాస్టళ్ళు, కోచింగ్ కేంద్రాలు నడుపుతున్నారు. అంతకు ముందు అదే బిల్డింగ్‌లో గృహోపకరాల కోసమే విద్యుత్ వినియోగం జరిగింది. అయితే ఇప్పుడు ట్రూ అప్ వేయడంతో ఎక్కువ భారం పడుతోందని చెబుతున్నారు. యాజమాన్యాలు ఇదంతా ఆయా హాస్టళ్ళల్లో చదివే వాళ్ళపైనే మోపుతున్నాయి.

ఇదెక్కడి అన్యాయం ?

2022లో మాకు కరెంట్ బిల్లు కేవలం రూ. 500 వరకూ వచ్చేది. అప్పట్లో వాడకం తక్కువ. ఈ ఏడాది ప్రతీ నెల ఎండాకాలం మాదిరి ఉంది. దీంతో వాడకం పెరిగింది. అప్పట్లో తక్కువ వాడినా, ఇప్పుడు వాడిన ప్రతి యూనిట్‌పై చార్జీ వేస్తున్నారు. ఈ నెల బిల్లు అదనంగా రూ.480 వచ్చింది.

- చాగలమర్రి సుదర్శన్ (వరంగల్)

అప్పు చేసి పిండి మిల్లు పెట్టుకుంటే..

చిన్న పిండిమిల్లు మాది. ఈ మధ్యే పెట్టాం. అదీ అప్పు చేసి. మాకు గతంలో కరెంట్ వాడకమే తక్కువ. బతుకు దెరువు కోసం పెట్టిన మిల్లుకు విద్యుత్ బిల్లు ఎక్కువవుతోంది. మేం విద్యుత్ ఎక్కువగా వాడని కాలానికి సంబంధించిన చార్జీలు ఇప్పుడు వినియోగం పెరిగినప్పుడు విధించడం న్యాయమేనా? ఇప్పటికే పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతున్నాం.

- ముప్పారపు సుజాత (ఖమ్మం)

నగరాల్లో రాంగ్‌రూట్.. జిల్లాల్లో మితిమీరిన వేగం



రథసారథి న్యూస్ ఇంటి నుంచి బయల్దేరిన వ్యక్తి తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకోవడం అగ్నిపరీక్షగా మారుతోంది. వాహనదారులు నగరాల్లో అత్యంత ప్రమాదకరంగా రాంగ్‌రూట్లలో దూసుకొస్తుంటే..జిల్లాల్లో వేగం హద్దులు దాటుతోంది. 2024, 2025, 2026 ఆగస్టు 15 వరకు నమోదైన ఈచలాన్ల గణాంకాలను రవాణాశాఖ తాజాగా అధ్యయనం చేసింది. మొత్తంగా 3.77 కోట్లకుపైగా ఉల్లంఘనలు నమోదైనట్లు వెల్లడించింది. హైదరాబాద్ మహా నగర మూడు పోలీస్ కమిషనరేట్ల పరిధిలోనే 37 లక్షల పైచిలుకు రాంగ్‌రూట్ కేసులు నమోదు కాగా..యాదాద్రి, కామారెడ్డి, నిజామాబాద్ వంటి జిల్లాల్లో అతి వేగం కేసులు భారీగా నమోదయ్యాయి.

నగరాల్లో ఎదురెదురుగా.. ప్రమాదకరంగా..

వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టుకున్నపుడు జరిగే ప్రమాదం తీవ్రత సాధారణ ప్రమాదాల కంటే ఎక్కువ ఉంటుంది. రాంగ్ రూట్ ప్రయాణాల్లో అత్యధికంగా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో 18,68,850..సైబరాబాద్‌లో 10,37,884, మల్కాజిగిరిలో 7,97,047 కేసులు నమోదు కాగా.. వరంగల్‌లో 1,54,030, ఫ్యూచర్ సిటీలో 87,515 ఉల్లంఘనలు నమోదయ్యాయి. రాష్ట్రం మొత్తంగా ఈ సంఖ్య 42.10 లక్షలు.

జిల్లాల్లోనూ వేగానికి కళ్లెం ఏదీ?

జిల్లాల్లో అధిక వేగం కేసులు భారీగా నమోదయ్యాయి. యాదాద్రి భువనగిరిలో 88,060, కామారెడ్డిలో 76,639, నిజామాబాద్‌లో 71,460, జోగులాంబ గద్వాలలో 70,409 కేసులు నమోదయ్యాయి. సంగారెడ్డిలో 41,392, నల్గొండలో 30,962, సూర్యాపేటలో 26,920 కేసులున్నాయి. రామగుండంలో 98,030 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా నమోదైన అతి వేగం కేసులు మొత్తం 25.28 లక్షలు.

హెల్మెట్ లేకుండా కోట్ల ప్రయాణాలు

హెల్మెట్ ధరించనివారిపై హైదరాబాద్‌లో 91,21,334, మల్కాజిగిరిలో 46,69,095 కేసులు నమోదయ్యాయి. వరంగల్‌లో 19,46,860, రామగుండంలో 12,37,630 కేసులు ఉన్నాయి. జిల్లాల్లో కామారెడ్డిలో 8,66,125, కరీంనగర్‌లో 7,12,524, నిజామాబాద్‌లో 6,93,660, యాదాద్రి భువనగిరిలో 5,95,432 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 2.48 కోట్లు.

సైబరాబాద్‌లో హెల్మెట్‌లేని కేసులు 8.89 లక్షలు, అధికవేగం ఉల్లంఘనలు 3.02 లక్షలు. ఫ్యూచర్‌సిటీలో అత్యధికంగా ఓవర్ స్పీడ్‌వి 3.02 లక్షలు..హెల్మెట్ లేనివి 2.95 లక్షల కేసులున్నాయి.

మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నిజామాబాద్‌లో 34,962, కామారెడ్డిలో 34,371, ఖమ్మంలో 22,508, కరీంనగర్‌లో 20,382 నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉల్లంఘనల మొత్తం సంఖ్య 8.93 లక్షలు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులు మహబూబ్‌నగర్‌లో 25,934, నిజామాబాద్‌లో 23,564, సంగారెడ్డిలో 16,800గా ఉన్నాయి. మొత్తం రాష్ట్రంలో ఈ సంఖ్య 9.29 లక్షలు. ఇక సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 7.25 లక్షలు..సిగ్నల్ జంపింగ్ 7.44 లక్షలు..ట్రిపుల్ రైడింగ్ 13.64 లక్షలపైమాటే.

జిల్లాలవారీగా ఉల్లంఘనలు ఇలా

అన్ని జిల్లాల్లో అత్యధికంగా నమోదైనవి హెల్మెట్ లేని కేసులే. ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఆందోళనకరంగా ఉన్నాయి.

హైదరాబాద్, కరీంనగర్, మల్కాజిగిరి, నిజామాబాద్, వరంగల్‌లో రాంగ్‌రూట్ కేసులు..భూపాలపల్లిలో సిగ్నల్ జంపింగ్..నల్గొండ, గద్వాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలు, రామగుండం కమిషనరేట్‌లో అధికవేగం కేసులు ఎక్కువ ఉన్నాయి.

ఖమ్మం, ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లైసెన్స్ లేని కేసులు అధికం. మహబూబాబాద్‌లో ట్రిపుల్ రైడింగ్ కేసులు ఎక్కువ.

ఐపీఎస్‌ల కార్ఖానాగా ఉత్తర్‌ప్రదేశ్..!



ఐపీఎస్‌ల కార్ఖానాగా ఉత్తర్‌ప్రదేశ్..!

రథసారథి న్యూస్ హైదరాబాద్: అఖిల భారత సర్వీసుల్లో అడుగుపెట్టాలనేది చాలామంది యువతలో ఉండే ఆకాంక్ష. దక్షిణాదితో పోల్చితే ఉత్తరాది నుంచి ఈ సర్వీసుల్లో అడుగుపెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్.. ఐపీఎస్‌ల కార్ఖానాగా మారింది. అక్కడి నుంచి ఏటా 15 శాతానికి పైగానే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దక్షిణాదిలో తెలుగు రాష్ట్రాల ప్రాతినిధ్యం పరిమితంగానే ఉంటోంది. హైదరాబాద్, బెంగళూరులాంటి దక్షిణాది నగరాలతో పోల్చితే ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రైవేటు రంగంలో ఎక్కువగా ఉద్యోగాలు లేకపోవడం.. అత్యధిక జనాభా... పొరుగునే ఉన్న దిల్లీలో సివిల్స్ శిక్షణ కేంద్రాలు ఎక్కువగా ఉండటం వంటివి అక్కడ యువతను ఎక్కువగా సివిల్స్ వైపు దృష్టి సారించేలా చేస్తున్నాయని సీనియర్ పోలీస్ అధికారులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో తెలుగు రాష్ట్రాల యువతకు ఐటీ పరిశ్రమల్లో అవకాశాలు ఎక్కువగా ఉండటంతో సివిల్స్ పట్ల అంతగా ఆసక్తి చూపట్లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్యాడర్లలో పనిచేసేందుకు ఎంపికవుతున్న ఐపీఎస్‌ల్లో అత్యధికులు ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉంటున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యమే ఎక్కువ

దేశంలో స్వాతంత్ర్యానంతరం 1950లో సివిల్ సర్వీసెస్ పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి 2,000 మందికి పైగా ఐపీఎస్‌లు ఎంపికైనట్లు తెలుస్తోంది. బిహార్ 1,450.. రాజస్థాన్ 1,000.. తమిళనాడు 930.. మహారాష్ట్ర 880.. మధ్యప్రదేశ్ 820.. హరియాణా 680.. పంజాబ్ 620.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 600.. కేరళం 500 మంది ఐపీఎస్‌లను అందించినట్లు సమాచారం.

ఐపీఎస్‌ల ఎంపికలో ఉత్తరాది ఆధిపత్యానికి నిపుణులు ఇంకా పలు కారణాలను విశ్లేషిస్తున్నారు. స్థానికంగా విద్యావాతావరణం, పోటీపరీక్షల శిక్షణ, కుటుంబాల ప్రోత్సాహం, సామాజిక పరిస్థితులు, అఖిల భారత సర్వీసులపై ఆసక్తి వంటి అనేక అంశాలను ప్రస్తావిస్తున్నారు.

ఉద్యోగ భద్రత, సమాజంలో హోదా వంటివి అక్కడి యువతను సివిల్ సర్వీస్‌ల వైపు ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు ఉద్యోగాలు ఎక్కువగా లేకపోవడంతో ప్రధాన కెరీర్ మార్గంగా సివిల్ సర్వీస్‌లను ఎంచుకుంటున్నారు.

ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. 76ఆర్ఆర్(రెగ్యులర్ రిక్రూట్) బ్యాచ్‌లో మొత్తం 188 మంది ఐపీఎస్ ప్రొబేషనర్లలో 31 మంది(16.48శాతం).. 77ఆర్ఆర్ బ్యాచ్‌లో మొత్తం 174 మందిలో 35 మంది(20.11శాతం) ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారే.

డిసెంబర్‌లో స్వదేశానికి!



రథసారథి న్యూస్ ఢాకా: ఏది ఏమైనప్పటికీ డిసెంబర్‌లో స్వదేశానికి రావడం ఖాయమని బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా పునరుద్ఘాటించారు. 2024లో జరిగిన నిరసనలతో షేక్ హసీనా స్వదేశాన్ని వీడి భారత్ చేరారు. అప్పటి నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. తన ప్రభుత్వ హయాంలో నిరసనకారులపై జరిగిన అణచివేతలకుగాను ఆమె మరణశిక్షను ఎదుర్కొంటున్నారు.

ట్రిబ్యునల్ తనకు మరణ శిక్ష విధించడాన్ని తిరస్కరించడంతోపాటు విచారణ చట్టబద్ధతను సైతం హసీనా సవాల్ చేస్తున్నారు. డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి రానున్నట్లు ఆమె ఆగస్ట్‌లోనే ప్రకటించారు. వచ్చే నెలలో భారత్‌లో ప్రవాసం వీడి బంగ్లాదేశ్‌కు తిరిగి రావడానికి కట్టుబడి ఉన్నానని 'అసోసియేటెడ్ ప్రెస్' తాజాగా ఈ మెయిల్ ద్వారా అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

'నేను మరణించాల్సి ఉంటే, నా సొంత నేలపై, నా సొంత ప్రజల మధ్యే చావడానికి ఇష్టపడతా. అందుకే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తా. ఈ నిర్ణయంలో ఎలాంటి మార్పూ లేదు'అని ఆమె కుండబద్దలు కొట్టారు. 'తిరిగి వస్తే అరెస్ట్ చేస్తారని నాకు తెలుసు. జైల్లో పెట్టవచ్చు, హింసించవచ్చు చంపనూ వచ్చు. అందుకు అవకాశముందనీ నాకు బాగా తెలుసు. కానీ, నా ప్రజలు బాధపడుతుండటాన్ని చూస్తూ నేను దూరంగా ఉండి నా జీవితాన్ని గడపలేను'అని ఆమె అన్నారు.

బంగ్లాదేశ్‌కు సురక్షితంగా తిరిగి వచ్చేందుకు భారత్, అమెరికా లేదా మరే ఇతర దేశం సాయాన్నీ కోరుకోవడం లేదని ఆమె వివరించారు. సొంత దేశానికి తిరిగి వెళ్లడానికి తనకు ఎవరి ఆశీస్సులూ అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే, భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ఎలా రావాలనుకుంటున్నదీ ఆమె వెల్లడించలేదు. 'అధికారం కోల్పోయిన తర్వాత 2024 ఆగస్ట్ నుంచి మా పార్టీ కార్యకర్తలు సుమారు 20 వేల మంది హత్యకు గురయ్యారు.

దాదాపు అంతే సంఖ్యలో నిర్బంధానికి గురయ్యారు. మరికొందరు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీ మద్దతుదారులు ఇళ్లు, వ్యాపారాలు, ఉపాధిని కూడా కోల్పోయారు. బంగ్లాదేశ్‌లో నేడు ఎలాంటి సాధారణ రాజకీయ, ప్రజాస్వామ్య వాతావరణం ఎంతమాత్రమూ లేదు' అని ఆమె పేర్కొన్నారు. బంగ్లా ప్రభుత్వం తన పార్టీని పథకం ప్రకారం అణచివేస్తోందని విమర్శించారు. హసీనా పదవీచ్యుతులైన తర్వాత, నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ తాత్కాలిక పాలనా బాధ్యతల్లో ఏడాదిన్నరపాటు కొనసాగారు. 2026 ఫిబ్రవరిలో హసీనా చిరకాల ప్రత్యర్థి, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టారు.

ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించారు. పార్టీ తీవ్ర అణచివేతను ఎదుర్కొంటున్న తరుణంలో హసీనా తిరిగి రావాలని కృతనిశ్చయంతో ఉన్నారు. పార్టీపై నిషేధం కొనసాగుతుండగా, సీనియర్ నాయకులు అరెస్టవడమో లేదా ప్రవాసంలోకి వెళ్లడమో జరిగింది. కొన్ని నెలలుగా పౌర, రాజకీయ హక్కులపై రెహమాన్ ప్రభుత్వం జరుపుతున్న దాడులను హ్యూమన్ రైట్స్ వాచ్‌తో సహా పలు హక్కుల సంఘాలు విమర్శించా యి. అయితే, ఈ అరెస్టులు నిర్దిష్టమైన ఆరోపణల ఆధారంగానే జరుగుతున్నాయని ప్ర భుత్వం చెబుతోంది. 2009-2024 మధ్య కా లంలో హసీనా ప్రధానిగా వ్యవహరించారు. చివరి నెలల్లో దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో 1,400 మంది వరకు చనిపోయినట్లు ఐక్యరాజ్యసమితి ఒక నివేదికలో తెలిపింది.

ఆరోపణలేనా.. రేవంత్‌పై చర్యల్లేవా?



రథసారథి న్యూస్ హైదరాబాద్: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట అవినీతికి పాల్పడుతున్నారని పదేపదే ఆరోపణలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు.. ఎందుకు ఆయనపై అవినీతి నిరోధక చర్యలు తీసుకోవడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా ఈ మేరకు మోదీ, అమిత్‌షాలకు గురువారం పలు ప్రశ్నలు సంధించారు. ''హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ఆర్ఆర్ ట్యాక్స్ వాస్తవమేనని చెబుతారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి.. హైదరాబాద్‌లో పర్యటించిన ప్రతిసారి ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తుంటారు. మరి ఆ వసూళ్లపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? భాజపా నేతలవి ఉత్త మాటలే. చర్యలు మాత్రం ఉండవు. ఇందుకు కారణం.. భాజపా, కాంగ్రెస్ మధ్య ఉన్న అంతర్గత అవగాహనే. అందుకే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదా?'' అని కేటీఆర్ ప్రశ్నించారు.

జల సంరక్షణ.. పల్లెలకు ఉపాధి



రథసారథి న్యూస్ హైదరాబాద్: జల సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం భారీ కార్యాచరణ సిద్ధం చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వచ్చే జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ''రాబోయే వర్షాకాలానికి ముందుగా ఆరు నెలలపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల; పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా అమలు చేస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తాం. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ఉంటుంది. దీన్ని అవకాశంగా మలుచుకొని దీర్ఘకాలం ఉపయోగపడేలా అధికారులు జలవనరులను సృష్టించాలి. ఉన్న సాగునీటి సదుపాయాలను బలోపేతం చేయాలి. భూగర్భ జలాల లభ్యతను మెరుగుపరచేలా పనుల ప్రణాళిక ఉండాలి. ఇప్పటికే 355 రకాల పనులతో సమగ్ర జాబితా సిద్ధమైంది. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ఈ కార్యాచరణ ఉంటుంది. ఈ కార్యక్రమానికి అవసరమయ్యే అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుతుంది. భూగర్భ జలాల పెంపుదల విషయంలో రాజస్థాన్, మహారాష్ట్రలలో అధ్యయనం చేయాలి. తెలంగాణ పరిస్థితులకు అనువైన విధానాలను గుర్తించి కార్యాచరణలో పొందుపరచాలి. భూగర్భజలాల పరిస్థితి, ప్రస్తుతం చేపడుతున్న చర్యలు, భవిష్యత్తు అవసరాలపై సమీక్షించేందుకు జిల్లాస్థాయి భూగర్భజల శాఖ అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం'' అని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమానికి ఆకర్షణీయమైన పేరు సూచించాలని కోరారు.



వచ్చే ఏడాదిలో ఉద్యోగం మారతాం

ముంబయి: ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, 2027లో ఉద్యోగం మారేందుకు 68.4 శాతం మంది భారతీయ నిపుణులు మొగ్గుచూపుతున్నారు. బలమైన కెరీర్ లక్ష్యాలను ఇది ప్రతిబింబిస్తోందని ఫౌండిట్ కెరీర్ రీసెట్ సర్వే 2027 తెలిపింది. దేశవ్యాప్తంగా 9,951 మంది నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను వెలువరించారు. అవసరమైతే తమ నైపుణ్యాలతో మంచి ఉద్యోగాలను సులభంగా సాధిస్తామని 94.1 శాతం మంది ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ఉద్యోగంలోనే ఉంటూ కొత్త అవకాశాలు వస్తే పరిశీలిస్తామని 18.1 శాతం వెల్లడించగా, పనిచేస్తున్న సంస్థలోనే కొనసాగుతూ ఎదగాలని కోరుకుంటున్న వారి సంఖ్య 3.7 శాతంగా ఉంది. ఉద్యోగం మారడానికి ఉద్యోగంలో వృద్ధి ఆశించడమే కారణమని 40.3 శాతం మంది పేర్కొన్నారు. 29.7 శాతం అధిక వేతనం కోసం, 20.3 శాతం మంది మెరుగైన పనిజీవిత సమతుల్యత కోసం కంపెనీలు మారాలని భావిస్తున్నారు. కనీసం 31 శాతం లేదా అంతకంటే ఎక్కువ వేతన పెంపు లభిస్తేనే ఉద్యోగం మారుతామని 51.5 శాతం మంది స్పష్టం చేశారు.

కృత్రిమ మేధ (ఏఐ)ను కెరీర్ అవకాశంగా 82.1 శాతం మంది భావిస్తున్నారు. వీరిలో 67% మంది నైపుణ్యాలను మెరుగుపరుచుకునే పనిలో ఉన్నారు. మరో 15.2 శాతం మంది ఏఐ ప్రాధాన్యతను గుర్తించినప్పటికీ, ఇంకా నైపుణ్యాల శిక్షణను ప్రారంభించలేదు. ఇదే సమయంలో నియామక ప్రక్రియల్లో పారదర్శకత లోపించడం సవాలుగా మారింది. 80.8 శాతం మంది అభ్యర్థులు నియామకా ప్రక్రియకు సంబంధించిన జాప్యాలు, సకాలంలో సమాచారం లేకపోవడానికి అసంతృప్తిగా పేర్కొన్నారు.



ఆభరణాల అమ్మకాలు తగ్గొచ్చు

పసిడి ధరలు బాగా పెరగడం వల్లే క్రిసిల్ రేటింగ్స్ అంచనా

ముంబయి: పసిడి ధరలు భారీగా పెరిగినందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల విక్రయాలు 46 శాతం తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ గురువారం ఒక నివేదికలో తెలిపింది. అధిక పారదర్శకతతో కూడిన విశ్వసనీయ బ్రాండుల వైపు వినియోగదార్లు ఎక్కువగా మొగ్గు చూపుతున్నందున, వ్యవస్థీకృత రిటెయిలర్లు కూడా మార్కెట్ వాటాను పెంచుకోవచ్చని అంచనా వేసింది. గిరాకీకి సవాళ్లతో కూడిన పరిస్థితులు ఉన్నప్పటికీ.. పాత బంగారం మార్పిడి, పసిడి పొదుపు పథకాలు ఆ సంస్థల మార్కెట్ వాటా పెరుగుదలకు మద్దతుగా నిలుస్తాయని పేర్కొంది. 'ఈ ఆర్థిక సంవత్సరంలో రిటెయిల్ ఆభరణాల అమ్మకాలు 46 శాతం తగ్గుతాయని మేం అంచనా వేస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరం కంటే పసిడి ధరలు సగటున 2527 శాతం పెరగడం ఇందుకు కారణం. అయితే ఈ పరిణామం ఆదాయాలు 21 23 శాతం మేర పెరిగేందుకు దోహదం చేస్తుంద'ని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక విశ్లేషించింది. 'ధరల ప్రభావం వినియోగదార్లపై ఉన్నప్పటికీ.. కొనుగోలు శక్తి ఆధారంగా తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాల వైపు వాళ్లు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల అమ్మకాలు 46 శాతం తగ్గుతాయని అంచనా వేస్తున్నాం. మొత్తం గిరాకీలో దాదాపు 40 శాతం వాటా ఉన్న నాణేలు, కడ్డీలపై పెట్టుబడులు కూడా 4 5 శాతం మేర తగ్గొచ్చ'ని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ హిమాంక్ శర్మ తెలిపారు.

మున్ముందు ఆభరణాల వర్తక రంగ పనితీరు పసిడి ధరల కదలికలు, దిగుమతి సుంకాలు, నియంత్రణ విధానాల్లో మార్పులు, మారుతున్న వినియోగదార్ల సెంటిమెంట్‌పై ఆధారపడి ఉంటుందని క్రిసిల్ నివేదిక వివరించింది.




శాట్‌కామ్‌కు కొత్త విధానం

'నెట్‌వర్క్ యాజ్ ఎ సర్వీస్'ను ప్రతిపాదించిన ట్రాయ్

దిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్స్ (శాట్‌కామ్) కోసం టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ 'శాటిలైట్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌యాజ్‌ఎసర్వీస్ (ఎస్‌సీఎన్‌ఏఏఎస్)' అనే కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం శాటిలైట్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు తమ మౌలిక సదుపాయాలను, సామర్థ్యాన్ని టెలికాం ఆపరేటర్లకు సర్వీస్ రూపంలో అందించవచ్చు. కానీ వినియోగదారులకు నేరుగా టెలికాం సేవలను అందించడానికి వీలుండదు. కొత్త విధానంలో అధీకృత శాటిలైట్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు తమ నెట్‌వర్క్‌ను ఇతర టెలికాం కంపెనీలకు అద్దెకు ఇవ్వవచ్చు. టెలికాం ఆపరేటర్లు (జియో, ఎయిర్‌టెల్ వంటివి) మాత్రమే వీరి నెట్‌వర్క్‌ను వాడుకుని చివరి వినియోగదారుడికి సేవలు అందిస్తారు.

డీ2డీ కనెక్టివిటీ: ఈ కొత్త విధానం ద్వారా డైరెక్ట్‌టుడివైస్ (డీ2డీ) కనెక్టివిటీకి మార్గం సుగమం అవుతుంది. శాటిలైట్, మొబైల్ స్పెక్ట్రమ్ రెండింటినీ ఉపయోగించి మొబైల్ ఫోన్లకు నేరుగా కనెక్టివిటీని అందించవచ్చు. కాలపరిమితి: ఈ కొత్త శాటిలైట్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ప్రొవైడర్ లైసెన్స్/అథరైజేషన్ దేశవ్యాప్తంగా తొలుత 20 ఏళ్ల కాలపరిమితితో అందుబాటులో ఉంటుంది. తర్వాత దీన్ని మరో 20 ఏళ్ల పాటు పొడిగించుకునే అవకాశం ఉంటుంది.



మార్కెట్లకు ముందే దీపావళి

ఆరో రోజూ దూసుకెళ్లిన సూచీలు

రూ.8.17 లక్షల కోట్లు పెరిగిన సంపద

దేశీయ స్టాక్ మార్కెట్లకు ముందుగానే దీపావళి పండగొచ్చింది. మదుపర్ల కొనుగోళ్లతో సెన్సెక్స్ 2009 పాయింట్లు దూసుకెళ్లగా, నిఫ్టీ మూడు నెలల గరిష్ఠానికి చేరింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేక ఫలితాలు వచ్చిన నేపథ్యంలో పశ్చిమాసియా సంక్షోభానికి పరిష్కారం లభించొచ్చన్న అంచనాలు సానుకూల ప్రభావం చూపాయి. ముడిచమురు ధరలు భారీగా తగ్గడం సెంటిమెంట్‌ను బలపరిచింది. బ్యారెల్ ముడిచమురు 97 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు పెరిగి 94.41 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో కొరియా, జపాన్ నష్టపోగా, షాంఘై, హాంకాంగ్ లాభపడ్డాయి, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.8.17 లక్షల కోట్లు పెరిగి రూ.501.61 లక్షల కోట్ల (5.31 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 1610 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 77,301.40 పాయింట్లు)తో 78,910.94 వద్ద ప్రారంభమైంది. మదుపర్ల కొనుగోళ్లతో రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 2,168.63 పాయింట్లు దూసుకెళ్లి 79,470.03 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2,008.61 పాయింట్ల లాభంతో 79,310.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 576 పాయింట్లు పెరిగి 24,536.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,296.03 24,579.90 పాయింట్ల మధ్య కదలాడింది. గత ఆరు ట్రేడింగ్ రోజుల్లో సెన్సెక్స్ 6,063.98 పాయింట్లు, నిఫ్టీ 1,837.75 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్ షేరు ఇష్యూ ధర రూ.82తో పోలిస్తే బీఎస్‌ఈలో 12.21% లాభంతో రూ.92.02 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.96.62 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరకు 15.38% పెరిగి రూ.94.61 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.594.38 కోట్లుగా నమోదైంది.

ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్‌లో అదనంగా 11.22 శాతం వాటాను రూ.2000 కోట్లకు అనుబంధ సంస్థ ఎఫ్ఐహెచ్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా ఫెయిర్‌ఫాక్స్ ఇండియా హోల్డింగ్స్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఒలోపటాడిన్ హైడ్రోక్లోరైడ్ కంటి చుక్కల ఔషధానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ నుంచి తుది అనుమతి లభించినట్లు అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ తెలిపింది.

పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్ను వాటాల కింద రూ.1.09 లక్షల కోట్లకు పైగా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ముందుగానే విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదల చేసే ఈ నెలవారీ వాటాను ఈ నెల 5నే విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది.

24 షేర్లకు లాభాలు

సెన్సెక్స్ 30 షేర్లలో 24 పరుగులు తీశాయి. బజాజ్ ఫైనాన్స్ 7.77%, ఇండిగో 5.80%, ఐసీఐసీఐ బ్యాంక్ 5.29%, మారుతీ 5.28%, ఎం అండ్ ఎం 5.15%, బజాజ్ ఫిన్‌సర్వ్ 4.66%, ఏషియన్ పెయింట్స్ 4.46%, యాక్సిస్ బ్యాంక్ 3.87%, ఎటర్నల్ 3.84%, అల్ట్రాటెక్ 3.55%, ఇన్ఫోసిస్ 3.46%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3.25% రాణించాయి. ఎన్‌టీపీసీ, బీఈఎల్, అదానీ పోర్ట్స్, ఐటీసీ 1.65% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన 4.13%, ఆర్థిక సేవలు 3.77%, స్థిరాస్తి 3.37%, పీఎస్‌యూ బ్యాంక్ 3.15%, వినియోగ 2.77% పెరిగాయి.



ఎల్‌ఐసీ లాభం రూ.12,076 కోట్లు

దిల్లీ: ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులైసెప్టెంబరు త్రైమాసికంలో రూ.12,076 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.10,053 కోట్లతో పోలిస్తే ఇది 20 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.2,39,614 కోట్ల నుంచి రూ.2,62,739 కోట్లకు చేరింది. నికర ప్రీమియం ఆదాయం రూ.1,26,479 కోట్ల నుంచి రూ.1,47,018 కోట్లకు చేరింది. రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ.64,996 కోట్ల నుంచి రూ.68,375 కోట్లకు పెరిగింది. తొలి ఏడాది ప్రీమియం రూ.10,836 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.10,432 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు రూ.2,30,160 కోట్ల నుంచి రూ.2,52,116 కోట్లకు చేరాయి.

2026 సెప్టెంబరు 30తో ముగిసిన 6 నెలల కాలానికి ఎల్‌ఐసీ వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ (వీఎన్‌బీ) 33.95 శాతం పెరిగి రూ.6,846 కోట్లకు చేరింది. గత ఏడాది కాలంలో ఇది రూ.5,111 కోట్లుగా ఉంది. వచ్చే 3, 4 త్రైమాసికాల్లో ఇది మరింత మెరుగయ్యే అవకాశం ఉందని ఎల్‌ఐసీ ఎండీ, సీఈఓ ఆర్.దొరైస్వామి అంచనా వేశారు. ఓపెన్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా అమ్మకం తర్వాత కూడా వ్యాపార భాగస్వామ్యం కొనసాగుతుందని, అలాగే ఆర్‌బీఎల్ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లతో ఎల్‌ఐసీ కుదుర్చుకున్న కొత్త ఒప్పందాల ప్రభావం ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో కనిపిస్తుందని ఎండీ పేర్కొన్నారు. ఎల్‌ఐసీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.59,60,941 కోట్లకు పెరిగింది.



ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు వినియోగదార్లపై మోపడానికి వీల్లేదు

సుప్రీంకోర్టుకు ఎన్‌పీసీఐ అఫిడవిట్ సమర్పణ

దిల్లీ: కొత్త యూపీఐ ధరల నిబంధనల ప్రకారం వ్యాపారులు ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) ఛార్జీలను వినియోగదారులపై వేయడానికి వీల్లేదని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన, వ్యక్తుల నుంచి వ్యాపారులకు జరిగే నిర్దిష్ట యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించే నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై, సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌పీసీఐ వంటి ఇతర సంస్థల నుంచి స్పందనలను కోరింది. అయితే ఈ అంశాన్ని పరిశీలించే వరకు సదరు నిర్ణయాన్ని నిలిపివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినప్పటికీ, సవరించిన విధానంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. నవంబరు 3న దాఖలు చేసిన ప్రతిస్పందన అఫిడవిట్‌లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు వినియోగదార్లపై యూపీఐ అప్లికేషన్ ప్రొవైడర్లు ప్లాట్‌ఫామ్ ఫీజులు లేదా ఇతర ఛార్జీలను విధించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనానికి ఎన్‌పీసీఐ తెలిపింది.

రొనాల్డో (పోర్చుగల్) ఆట ముగిసె!



అంతర్జాతీయ

ఫుట్‌బాల్‌కు దిగ్గజం గుడ్‌బై

234 మ్యాచ్‌లలో 146 గోల్స్

క్లబ్ స్థాయిలో కొనసాగనున్న స్టార్

లిస్టన్:

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఒక అద్భుత ఆటగాడి శకం ముగిసింది. 23 ఏళ్ల పాటు పోర్చుగల్ టీమ్ తరఫున అలరించిన స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో ఇకపై జాతీయ జట్టు తరఫున ఆడనంటూ రిటైర్మెంట్ ప్రకటించాడు. 18 ఏళ్ల వయసులో 2003లో పోర్చుగల్ తరఫున తొలిసారి బరిలోకి దిగిన రొనాల్డో 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ కొట్టాడు. నిజానికి ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో ఓడిన వెంటనే రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి తప్పుకోవాలని భావించినా... పోర్చుగల్ ఫెడరేషన్ (ఎఫ్‌పీఎఫ్) అధ్యక్షుడు పెడ్రో పొన్‌కా విజ్ఞప్తితో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. అయితే టీమ్ కోచ్ జోర్గ్ జీసస్‌తో విభేదాలు తీవ్రమయ్యాయి.

గత సెప్టెంబర్ లో నేషన్స్ లీగ్‌లో భాగంగా వేల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను పోర్చుగల్ తరఫున తన చివరి మ్యాచ్ ఆడాడు. నార్వేతో జరిగిన తర్వాతి మ్యాచ్ నుంచి కోచ్ పూర్తిగా తప్పించడంతో రొనాల్డో చెప్పాపెట్టకుండా క్యాంప్ నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత రాజీ కుదిరినా అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఎఫ్‌పీఎఫ్ 30 రోజుల నిషేధాన్ని, జరిమానాను విధించింది. ఈ స్థితిలో ముస్మందు టీమ్‌లోకి వచ్చే అవకాశం లేకపోవడంతో రొనాల్డో ఆటకు గుడ్‌బై చెప్పాడు. 41 ఏళ్ల రొనాల్డో క్లబ్ ఫుట్‌బాల్‌లో మరికొంత కాలం కొనసాగనున్నాడు. ప్రస్తుతం అతను సౌదీ అరేబియాకు చెందిన అల్-నాసర్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ఘనమైన రికార్డు...

తన సమకాలీకుడు, మరో దిగ్గజం లయోనల్ మెస్సీతో పోలిస్తే 'ఫిఫా' వరల్డ్ కప్ గెలవకపోవడమే రొనాల్డో సుదీర్ఘ కెరీర్‌లో లోటుగా ఉండిపోయింది. ఇది మినహా 23 ఏళ్ల పాటు జాతీయ జట్టు ఆటగా





డిగా అతని విలువ అమూల్యం. రెండు దశాబ్దాలకు పైగా అతను పోర్చుగల్ టీమ్‌కు కర్త, కర్మ, క్రియలా నిలిచాడు. యూరోప్‌లోని ఇతర జట్లతో పోలిస్తే అత నొక్కడి వల్లే పోర్చుగల్‌కు ప్రత్యేక ఆకర్షణ వచ్చిందన డంలో సందేహం లేదు.

రొనాల్డో రాకముందు వరకు ఒక్క మేజర్ ట్రోఫీ కూడా గెలవని టీమ్ 2016లో తొలిసారి ప్రతిష్టా త్మక 'యూరో కప్'ను సొంతం చేసుకుంది. 2019, 2025లలో అతని ప్రదర్శన వల్లే 'యూరో నేషన్స్ లీగ్' టోర్నీని గెలుచుకుంది. రొనాల్డో రాకముందు వరకు కేవలం 3 సార్లు మాత్రమే 'ఫిఫా' వరల్డ్ కప్‌కు క్వాలిఫై అయిన పోర్చుగల్... అతను వచ్చిన తర్వాత 2006 నుంచి 2026 వరకు వరుసగా ఆరు వరల్డ్ కప్‌లకు అర్హత సాధించడం విశేషం.


234 అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా రికార్డు

146 అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా రికార్డు

6 వరుసగా ఆరు వరల్డ్ కప్‌లలో (2006, 2010, 2014, 2018, 2022, 2026) గోల్స్ కొట్టిన ఏకైక ఆటగాడు. మొత్తం 27 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిన రొనాల్డో 11 గోల్స్ కొట్టాడు.

'జెర్సీ నంబర్ 7ను పోర్చుగీస్ ప్రజలకు తిరిగి అప్పగించాల్సిన సమయం వచ్చేసింది. 23 ఏళ్ల పాటు ఇది నా ఒక్కడిదే కాదు. ఎంతో బాధ్యతతో కూడిన గౌరవంతో ప్రపంచవ్యాప్తంగా దీనిని నేను ధరించాను. కొన్ని నిర్ణయాలు కేవలం మన ఆలోచనతో తీసుకునేవి కాదు. అవి హృదయంతో తీసుకోవాల్సినవి. అందుకే ఇది అంత సులువైన నిర్ణయం కాదు. 2003 ఆగస్టులో మొదలై నా జీవితాన్ని మార్చేసిన ప్రయాణం ముగిసింది. దేశం తరఫున ప్రతీసారి నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాను. ప్రతీసారి గెలవాలనే శ్రమించాను. మనం ఇంకా ముందుకు వెళ్లగలమని నమ్మాను. చరిత్ర సృష్టించాలని ఆశించాను. ఇన్నేళ్లలో ఎన్నో గొప్ప అనుభూతులు ఉన్నాయి. బాధపెట్టిన కొన్ని పరాజయాలూ ఉన్నాయి. కొన్ని తప్పుల వల్ల నేనూ బాధపడ్డాను. పోర్చుగీస్ ప్రజలు ఎంతో కోరుకున్న విజయాన్ని మాత్రం అందించలేకపోయాను. కానీ నేను చివరి వరకు పోరాటం ఆపలేదు. పోర్చుగల్‌కు ప్రాతినిధ్యం వహించడం ప్రతీసారి గర్వకారణంగా భావించాను. 23 ఏళ్ల పాటు నాకు అండగా నిలిచిన, నాపై నమ్మకం ఉంచిన వారందరికీ కృతజ్ఞతలు. ఫుట్‌బాల్ వెంట పరుగెత్తడమే పనిగా ఆడుకున్న ఒక చిన్నారి కలను నిజం చేసినవారందరికీ ధన్యవాదాలు.

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైపాల్‌కు రజతం



ఒలింపిక్ కోటా కూడా మను బృందానికి వెండి

దోహా: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత పతక నిరీక్షణకు తెరపడింది. గురువారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో జైపాల్ మాల్వియా రజతంతో మెరిశాడు. క్వాలిఫికేషన్లో 585 పాయింట్ల తో మూడో స్థానం సాధించి ఫైనల్‌కు వెళ్లిన జైపాల్.. పతక పోరులోనూ సత్తా చాటాడు. 242.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. హు కయ్ (చైనా, 243.9) స్వర్ణం, జింద్రిచ్ డుబోవీ (చెకియా, 220.9) కాంస్యం గెలిచారు. పోడియంపై నిలవడం ద్వారా జైపాల్.. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ కోటాను కూడా దేశానికి సంపాదించి పెట్టాడు.

మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్‌లో మను బాకర్, సంయమ్, సురుచిలతో కూడిన జట్టు రజతం సొంతం చేసుకుంది. క్వాలిఫికేషన్లో మను 583, సురుచి 580, సంయమ్ 575 పాయింట్లు సాధించారు. దీంతో భారత్ మొత్తం 1738 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా (1745) స్వర్ణం, కొరియా (1729) కాంస్యం నెగ్గాయి. క్వాలిఫికేషన్లో మను మూడు, సురుచి ఎనిమిదో స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు వెళ్లినా.. ఆఖరి మెట్టుపై తడబడ్డారు. మను (179.9), సురుచి (158.3) వరుసగా అయిదు, ఆరో స్థానాలతో సరిపెట్టుకున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో చైనా అమ్మాయిలు జియాంగ్ (242.4), యావో (242.1) స్వర్ణ, రజతాలు గెలవగా.. మజోర్ (హంగేరి, 222.1) కాంస్యం సాధించింది.



మీ పోరాటాలు దేశానికి స్ఫూర్తి: ప్రధాని మోదీ

పారా అథ్లెట్లతో ప్రధాని మోదీ, క్రీడల మంత్రి మాండవీయ

దిల్లీ: పారా ఆసియా క్రీడల్లో పతకాలతో సత్తాచాటిన భారత క్రీడాకారులను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. క్రీడాకారుల కష్టాలు, పోరాటాలు, ఘన విజయాలు యావత్ దేశానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. జపాన్‌లో 114 (30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు) పతకాలతో పట్టికలో నాలుగో స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించిన భారత బృందంతో గురువారం మోదీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రెండు స్వర్ణాలు నెగ్గిన ఆర్చర్ శీతల్ దేవి, స్ప్రింటర్ సిమ్రన్.. ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' క్రీడాకారులు జీవాంజి దీప్తి, అకీర నందన్‌తో పాటు పతకాలు గెలిచిన వారంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వయంగా పలువురు అథ్లెట్లకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.


''ప్రపంచ క్రీడారంగంలో భారత్ ఒక గొప్ప శక్తిగా ఎదుగుతోందని మీ అద్భుత ప్రదర్శన చాటిచెబుతోంది. మీరు కేవలం పతకాలే కాదు కోట్లాది మంది భారతీయుల హృదయాలు కూడా గెలుచుకున్నారు. మీ పోరాటాలు, విజయాలు ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలుస్తాయి. మీరు పట్టు వదలకుండా నిలబడినట్లే.. మేం కూడా మా లక్ష్యాలపై అలాగే దృష్టి నిలిపాం. యువ ప్రతిభ వృథా కాకూడదని నిర్ణయించుకున్నాం. మీ ప్రగతికి అడ్డంకిగా మారిన పాత వ్యవస్థను మార్చాలని నిశ్చయించుకున్నాం. ఇప్పుడు తమ ప్రతిభపై నమ్మకం ఉన్న ప్రతి క్రీడాకారుడికి దేశం తన వెంట ఉందనే కొండంత విశ్వాసం కలిగింది. ఈ విజయాన్ని మరింత పెద్ద లక్ష్యాలను చేరుకోడానికి వేదికగా ఉపయోగించుకోవాలి'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఐటా పాలక మండలిలో భూపతి, సానియా

దిల్లీ: భారత టెన్నిస్ స్టార్లు మహేశ్ భూపతి, సానియా మీర్జా.. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) పాలక మండలిలో చోటు దక్కించుకున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) ఎన్నికలో భూపతికి 23 ఓట్లు రాగా.. సానియాకు 18 మంది ఓటేశారు. అంతకుముందు ఐటా సర్వసభ్య ఎన్నికల్లో వీరిద్దరూ స్పోర్ట్స్‌పర్సన్స్ ఆఫ్ ఔట్‌స్టాండింగ్ మెరిట్ (ఎస్ఓఎమ్) ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. ఇక్కడ మహేశ్ 19, సానియా 18 ఓట్లు దక్కించుకున్నారు. అశుతోష్ సింగ్ (17 ఓట్లు), షాలిని ఠాకూర్ చావ్లా (16) మిగతా రెండు స్థానాల్ని పొందారు. సవరించిన ఐటా నిబంధనల ప్రకారం ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలకు ఎస్ఓఎమ్ ప్రతినిధులుగా అవకాశం లభిస్తుంది.

భారత్ హ్యాట్రిక్.. మూడోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ కైవసం

పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌తో భారత హాకీ జట్టు



మొహాలీ: ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్లో భారత్ హ్యాట్రిక్ కొట్టింది. జోరు కొనసాగిస్తూ వరుసగా మూడోసారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. గురువారం ఫైనల్లో భారత్ 41తో జపాన్‌ను చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో ఆరంభం మాత్రం జపాన్‌దే. 3వ నిమిషంలో మట్సుమొటో గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. భారత్ ఎంత ప్రయత్నించినా.. స్కోరు మాత్రం సమం చేయలేకపోయింది. కానీ మూడో క్వార్టర్ ఆఖర్లో శిలానంద్ లక్రా (42వ) పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేయడంతో స్కోరు 11గా మారింది. ఈ గోల్ ఇచ్చిన ఉత్సాహంతో.. నాలుగో క్వార్టర్‌లో భారత్ విజృంభించింది. దిల్‌ప్రీత్ సింగ్ (48వ), జుగ్‌రాజ్ (53వ), వివేక్ సాగర్ (54వ) స్వల్ప వ్యవధిలో చేసిన గోల్స్‌తో 41తో ఆధిక్యంలో నిలిచింది. చివరి ఆరు నిమిషాల్లో ప్రత్యర్థి గోల్స్ చేయకుండా అడ్డుకుని, విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా మూడో టైటిల్. 2023, 2024లోనూ విజేతగా నిలిచింది. మొత్తంగా ఆరో టైటిల్. 2011, 2016, 2018 టోర్నీల్లోనూ భారత్ ఛాంపియన్ అయింది. మరోవైపు ప్రస్తుత టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో మలేసియా 52తో కొరియాను ఓడించింది.



రివ్యూ: రామాయణ: పార్ట్-1..

నితేశ్ తివారీ చిత్రం ఎలాంటి అనుభూతినిచ్చింది?

Ramayana Movie Review || చిత్రం: రామాయణ: పార్ట్-1; నటీనటులు: రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ దేవోల్, రవి దూబే తదితరులు, దర్శకత్వం: నితేశ్ తివారి; విడుదల: 05-11-2026

ఇతిహాసగాథ 'రామాయణం' అద్భుత దృశ్య కావ్యం. ఎప్పుడు.. ఎక్కడ.. చూసినా, విన్నా నిత్యనూతనంగా అనిపిస్తుంది. వెండితెర, బుల్లితెరల మీద ఇప్పటికే ఈ కథ కోట్లమంది ప్రేక్షకులను రంజింపజేసింది. ఇప్పుడు మరోసారి అత్యాధునిక హంగులతో నితేశ్ తివారి దర్శకత్వంలో 'రామాయణ' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. (Ramayana Movie Release Date) మరి ఈసినిమా ఎలా ఉంది? ప్రేక్షకుడికి ఎలాంటి అనుభూతిని ఇచ్చింది?

కథేంటంటే?

Ramayana Part 1 story || ముల్లోకాలపై ఆధిపత్యం కోసం దేవతలు, రాక్షసులకు మధ్య యుగాలుగా యుద్ధం కొనసాగుతుంటుంది. అది అంతిమ దశకు చేరుకున్నప్పుడు మొదలయ్యే కథ ఇది. అసురుల సైన్యానికి రాకుమారి కైకసి (శోభన) నాయకత్వం వహిస్తుంది. శ్రీ మహావిష్ణువు ఆశీర్వాద బలంతో దేవతలే పైచేయి సాధిస్తారు. అసురులకు మరోసారి అవమానమే ఎదురవుతుంది. లంకా నగరం దేవతల వశమవుతుంది. పరిపాలన బాధ్యతల్ని కుబేరుడికి అప్పజెబుతారు. పరాజయ భారంతో రగిలిపోయిన కైకసి... సంగీత శాస్త్రాలే ప్రపంచంగా గడుపుతున్న తన కుమారుడు దశానన (Yash) దగ్గరకు వెళ్లి తరాలుగా అసురజాతికి ఎదురవుతున్న అవమానాల గురించి చెబుతుంది. అది విన్న దశానన కఠోరమైన తపస్సు చేస్తాడు. ఆ తపస్సుకి మెచ్చి బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమవుతాడు. అటు అసురులు, ఇటు దేవతల చేతిలో తనకు మరణం ఉండకూడదని వరం కోరుకుంటాడు. ఆ వర గర్వంతో లంకా నగరంపై విరుచుకుపడతాడు. ఇక నుంచి ముల్లోకాలకూ తానే అధిపతినని ప్రకటించుకున్న ఆ దశాననుడే రావణుడు (యశ్). రావణ పట్టాభిషేకం తర్వాత లంకలో చోటు చేసుకున్న పరిణామాలేమిటి? దశరథుడి పాలనలో ఉన్న అయోధ్యలో ఏం జరిగింది? శ్రీరాముడు (రణ్‌బీర్ కపూర్) పట్టాభిషిక్తుడు కావల్సిన సమయంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి? అన్నది 'రామాయణ: పార్ట్ 1' కథ (Ramayana Movie Part 1).

ఎలా ఉందంటే?

Ramayana Movie Review Telugu || తరాలు.. సాంకేతికత మారుతున్న కొద్దీ... అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు రామాయణం సినిమాగా తెరకెక్కుతూనే ఉంది. అందరికీ తెలిసిన వాల్మీకి రామాయణాన్ని మరోసారి అత్యున్నత సాంకేతిక హంగులతో తెరపైకి తీసుకొచ్చారు నితీశ్ తివారి. మన సంస్కృతిలో భాగమైన ఇతిహాసాన్ని నేటి తరానికి మరింత సులువుగా, స్పష్టంగా అర్థమయ్యేలా చేరువ చేయాలన్న ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. ఆ క్రమంలో కొన్ని సన్నివేశాలు అక్కడక్కడా నెమ్మదిగా సాగినట్లు అనిపించినా... రామాయణం కథ (Ramayana Movie Story)లోని విలువలు, భావోద్వేగాలు మనసుల్ని హత్తుకునేలా తెరపై ఆవిష్కరించిందీ చిత్రం.

సీతాపహరణం వరకూ సాగే తొలి భాగం ప్రేక్షకుల్ని పూర్తిగా కథా ప్రపంచంలో మమేకం చేస్తుంది. హనుమంతుడి పరిచయం, రామరావణ యుద్ధంతో రెండోభాగం రానుంది. పాత్రల్ని చూపించడంలో దర్శకుడు (Director Nitesh Tiwari) ఎలాంటి ప్రయోగాల జోలికీ వెళ్లలేదు. మనదైన ఇతిహాసాన్ని హాలీవుడ్ సినిమాల కన్నా ఘనంగా, కళ్లు చెదిరే విజువల్స్‌తో తెరపైన ఆవిష్కరించారు. అసురులు, దేవతల యుద్ధం, రావణుడి బాల్యం నుంచి ఈ కథని మొదలుపెట్టాడు దర్శకుడు. రావణుడి బాల్యం నేపథ్యం ఈ సినిమాని ప్రత్యేకంగా మార్చింది. ఇదివరకటి సినిమాల్లో అంతగా స్పృశించని కోణమిది. రావణుడు లంకా నగరంపై దండెత్తడం నుంచి అసలైన రామాయణం మొదలవుతుంది.

మరోవైపు రాముడి జననం, బాల్యం, వీరత్వం... ఇలా ఒక్కొక్క ఘట్టాన్ని తెరపై ఆవిష్కరిస్తూ ప్రేక్షకుడిని లీనం చేస్తుంది చిత్రం. శ్రీరాముడు, రావణుల పరిచయ సన్నివేశాలు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసురులైన తాటకి, సుబాహులతో శ్రీరాముడు అడవిలో చేసే యుద్ధం ప్రథమార్ధానికి ప్రధాన ఆకర్షణ. ఆ సన్నివేశాల్లో యాక్షన్, విజువల్స్ కట్టిపడేస్తాయి. స్వయంవరం, సీతారాముల వివాహం, ఆ నేపథ్యంలోని గీతం ఆ తర్వాత దశరథుడు, కైకేయి, శ్రీరాముడి మధ్య సాగే సన్నివేశాలు రామాయణ ఇతిహాసంలోని భావోద్వేగాల్ని పక్కాగా ఆవిష్కరిస్తాయి. (Ramayana Movie Review 2026)

విరామం తర్వాత వనవాసం చుట్టూ సినిమా (Ramayana Movie Telugu) సాగుతుంది. అందరికీ తెలిసిన కథ, ఘట్టాలే అయినా వాటిని దర్శకుడు ప్రత్యేకమైన విజువల్ డిజైన్‌తో తెరపైన ఆవిష్కరించిన తీరు బాగుంటుంది. అయోధ్య సమీపం నుంచి దట్టమైన అడవుల్లోకి వెళ్లే క్రమంలో అసురులతో సాగే యుద్ధం ఎపిసోడ్ ఆకట్టుకుంటుంది. మరోవైపు రావణుడికీ, విద్యుత్‌జిహ్వుడు మధ్య సన్నివేశాలు, రాముడు శూర్పణఖ నేపథ్యం, సీతాపహరణం సమయంలో జటాయువు రావణుడి మధ్య పోరాట సన్నివేశాలు ద్వితీయార్ధానికి హైలైట్. పుష్పకవిమానం చుట్టూ అల్లిన సన్నివేశాలు దర్శకుడి గొప్ప విజువలైజేషన్‌కు అద్దం పట్టేలా ఉంటాయి. ప్రతి పది నిమిషాలకీ ప్రత్యేకమైన విజువల్ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ రక్తికట్టిస్తుందీ చిత్రం (Ramayana Movie Review Telugu). సహనమా, ప్రతీకారమా అంటూ ఆలోచించి నిర్ణయాలు తీసుకునే రావణుడు, విద్యుత్‌జిహ్వుడు చుట్టూ అల్లిన సన్నివేశాలు సినిమాని మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఇదొక పురాణ గాథే అయినా.. ఘనమైన విజువల్ హంగుల కారణంగా ఓ మంచి ఫాంటసీ చిత్రం చూసిన అనుభూతి కూడా కలుగుతుంది. చిన్నారులకు మరింతగా నచ్చే అవకాశం ఉంది. మన పురాణ గాథలు, పాత్రల్ని తెరపై ఏ స్థాయిలో ఆవిష్కరించవచ్చో ఈ సినిమా చాటి చెప్పింది.

ఎవరెలా చేశారంటే...

- శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ (Ranbir Kapoor) ఒదిగిపోయాడు. ఆ పాత్రకు తగ్గట్టుగా హుందాగా కనిపిస్తూనే భావోద్వేగాల్ని పండించారు. ముఖ్యంగా వనవాసానికి ముందు సన్నివేశాల్లోనూ, ద్వితీయార్ధంలో సీతాపహరణం తర్వాత విధి గురించి బాధపడే సందర్భంలోనూ ఆయన నటన ఆకట్టుకుంటుంది. యాక్షన్ సన్నివేశాలతోనూ కట్టిపడేశాడు.
- రావణుడిగా యశ్ (Yash) వంద శాతం న్యాయం చేశారు. పరిచయ సన్నివేశాలతోనే ఆయన సినిమాపై బలమైన ప్రభావం చూపించారు. ఆ తర్వాత ఆయన చాలాసేపు తెరపై కనిపించకపోయినా సరే, రావణుడి ప్రభావం సినిమాపై కనిపిస్తూనే ఉంటుంది. ద్వితీయార్ధంలో విద్యుత్ జిహ్వుడు, జటాయువుతో తలపడే సన్నివేశాలతోనూ బలమైన ప్రభావం చూపించారు.
- సీతగా సాయిపల్లవి (Sai Pallavi) అభినయం ఆకట్టుకుంటుంది. లక్ష్మణుడిగా రవి దూబే, శూర్పణఖగా రకుల్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. కాజల్, వివేక్ ఒబెరాయ్ తదితర నటులకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు.
- సాంకేతిక విభాగాలు అత్యున్నత పనితీరుని కనబరిచాయి. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్. ఆస్కార్ పురస్కారాలు గెలిచిన డి.ఎన్.ఇ.జి అత్యున్నతమైన విజువల్ హంగుల్ని మేళవించింది. ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం పురాణ గాథకు తగ్గట్టుగా అందంగా కుదిరింది.
- పంకజ్ కుమార్, మహేష్ లిమాయే విజువల్స్, ప్రొడక్షన్ డిజైన్ విభాగం సమన్వయం సినిమాపై బలమైన ప్రభావం చూపించింది. నితేశ్ తివారీ గొప్ప విజువలైజేషన్‌తో రామాయణాన్ని చెప్పారు. ఆయన ఈ కథని ఎంత ఘనంగా ఊహించుకున్నారో, అందుకు తగ్గట్టుగానే తన బృందాన్ని నడిపించారు. నిర్మాణం ఉన్నతంగా ఉంది. 3Dలో ఈ సినిమా (Ramayana Movie) మరింత ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది.

బలాలు

+ విజువల్స్
+ నటీనటులు
+ యాక్షన్ ఘట్టాలు

బలహీనతలు

- అక్కడక్కడా నెమ్మదిగా సాగే సన్నివేశాలు

చివరిగా: రామాయణం... నేటి తరానికి నచ్చేలా తీర్చిదిద్దిన దృశ్యకావ్యం (Ramayana Movie Review Telugu)


గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

ఇతర నటీనటులు: అరుణ్ గోవిల్, లారా దత్త, ఇందిరా కృష్ణన్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, అనుపమ్ ఖేర్ (జటాయువు వాయిస్), వివేక్ ఒబెరాయ్, హరీశ్ ఉత్తమన్, కునాల్ కపూర్ తదితరులు; సంగీతం: హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్; సినిమాటోగ్రఫీ: పంకజ్ కుమార్, మహేశ్ లిమాయే; ఎడిటింగ్: హుజేఫా లోఖండవాలా; నిర్మాత: నమిత్ మల్హోత్ర, యశ్; స్క్రీన్‌ప్లే: శ్రీధర్ రాఘవన్, నితేశ్ తివారి



యువతని ఆలోచింపజేసేలా

సుడిగాలి సుధీర్ హీరోగా వేదవ్యాస్ తెరకెక్కించిన చిత్రం 'గోట్'. చంద్రశేఖర్. ఎమ్ నిర్మించారు. దివ్య భారతి కథానాయిక. బ్రహ్మాజీ, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే కథానాయకుడు దుల్కర్ సల్మాన్ గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ''అందర్నీ అలరించే కథతో అన్ని రకాల వాణిజ్యాంశాల్ని మేళవించి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇందులో నేటి యువతని ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంది. సుధీర్ పాత్ర యువతరానికి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకి లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చగా.. మణిశర్మ నేపథ్య సంగీతం అందించారు.



గన్‌మాస్టర్.. ఈశ్వర్

''తుపాకులు గర్జించినప్పుడు, అత్యంత బలవంతులు మాత్రమే మిగులుతారు. మిమ్మల్ని ఉత్కంఠకు గురిచేసే ఒక సరికొత్త యాక్షన్ అవతారంలో ఈశ్వర్ కనిపించనున్నారు'' అనే వ్యాఖ్యతో 'గన్‌మాస్టర్ జి9' చిత్రంలో బాలీవుడ్ కథానాయకుడు ఇమ్రాన్ హష్మీ పాత్రను పరిచయం చేసింది చిత్రబృందం. ఆయన.. జెనీలియా ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రమిది. ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపక్ ముకుత్, హునార్ ముకుత్, సంగీత అహిర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అపర్శక్తి ఖురానా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 27న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ సినిమా నుంచి ఇమ్రాన్ పాత్రను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ఈ పోస్టర్‌లో ఇమ్రాన్ గన్ పట్టుకొని శత్రువులతో తలపడటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాను ప్రేమించిన అమ్మాయిని కాపాడుకునే ప్రయత్నంలో ఈశ్వర్ చేసే యాక్షన్ హంగామానే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి.



ఘనంగా సాయి దుర్గా తేజ్ నిశ్చితార్థం..

వివాహం ఎప్పుడంటే?

మెగా కుటుంబంలో మరో కథానాయకుడు ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. చిరంజీవి మేనల్లుడు, యువ నటుడు సాయి దుర్గా తేజ్ (Sai Durgha Tej) త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్నాడు. ఆయన వివాహం చేసుకోబోయే అమ్మాయి పేరు కిరణ్. గురువారం కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఇందుకు సంబంధించిన ఫొటోను నటుడు రామ్‌చరణ్ పంచుకుని శుభాకాంక్షలు చెప్పారు. డిసెంబరు 10న హైదరాబాద్‌లో సాయి తేజ్‌కిరణ్‌ల వివాహం (sai durgha tej marriage) జరగనుంది. గురువారం జరిగిన నిశ్చితార్థ వేడుకలో తల్లిదండ్రులు డాక్టర్ శివప్రసాద్, విజయ్ దుర్గా, సోదరుడు వైష్ణవ్ తేజ్, అత్తయ్యమావయ్య చిరంజీవి, సురేఖలతో పాటు, రామ్‌చరణ్, అల్లు అర్జున్, అల్లు స్నేహారెడ్డి, అల్లు బాబీ, వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, వాయువ్ తేజ్, నాగబాబు, పద్మజ, నిహారిక కొణిదెల, అల్లు అరవింద్, అల్లు నిర్మల, అల్లు శిరీష్, నయనిక రెడ్డి, అఖీరా నందన్, ఆద్య సహా మెగా కుటుంబం ఈ వేడుకలో పాల్గొంది. సాయితేజ్ స్నేహితులు మంచు మనోజ్, మౌనికారెడ్డి, నవీన్ విజయ్ కృష్ణ, హర్ష చెముడు, వెంకీ కుడుముల, హర్షిత్‌రెడ్డి తదితరులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.



నా బాడీ ఫీచర్స్ నాకే నచ్చవు..

సంచలనంగా పూజాహెగ్డే కామెంట్స్

నా రూపం నాకే నచ్చేది కాదు అంటూ షాకింగ్ విషయాలు పంచుకుంది టాలీవుడ్ హీరోయిన్ పూజా హెగ్డే. తాజాగా ఓ బ్రాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈమె తన చిన్ననాటి విషయాలు పంచుకుంటూ.. 'నేను చాలా చిన్న వయసులో ఉన్నప్పుడు నా రూపానికి సంబంధించి ఎన్నో విషయాలు నాకు నచ్చేవి కాదు. నా ఫేస్‌లో ముక్కు నచ్చేది కాదు. వాటిని చూసుకుని బాధపడేదాన్ని. ముఖ్యంగా నా నవ్వు అస్సలు ఇష్టం ఉండేది కాదు. అయితే.. ఒకసారి ఈ విషయాన్ని మా నాన్న దగ్గర చెప్పుకుని బాధపడ్డాను. అప్పుడు మా నాన్న 'దేవుడు నీ ముఖానికి ఏ ముక్కు సరిపోతుందో దాన్నే ఇచ్చాడు. ఒకవేళ పెద్ద ముక్కు నీ ముఖంపై ఉంటే ఎలా ఉంటుందో ఊహించుకో' అని చెప్పారు. ఆ మాటతో నాకు నా ఫీచర్స్ పట్ల అవగాహన వచ్చింది. అయితే మనం మన గురించి ఆలోచించేటప్పుడు చాలా సున్నితంగా, నెగిటివ్‌గా ఆలోచిస్తాము. అది బాలేదు, ఇది బాలేదు అని మనల్ని మనమే తక్కువ చేసుకుంటాం. అది అస్సలు మంచి విషయం కాదు' అని చెప్పుకొచ్చింది. అలాగే.. ఒకప్పుడు తాను అసహ్యించుకున్న ముక్కు, నవ్వులనే ఈరోజు ప్రేక్షకులు ఎంతో ఇష్టపడుతున్నారని, అందుకే మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమని పూజా చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

Edited, Printed and Owned by PALA SWATHI, Printed at SAKETH PUBLICATIONS, # 5-1-87/4/B/1, SIDDARTHA NAGAR, TELANGANA - 502001. Published From Plot.NO. 15, Sai Krupa Nagar, Beside SUNRISE HOSPITALSANGAREDDY, TELANGANA - 502001. Editor PALA SWATHI, RNI Regn. No. TGTEL/26/A3311, Cel: 87902 88333